



# విజయభాను






విశాఖపట్నం, బుధవారం 26-02-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 146 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## భారత్-అమెరికా సంబంధాల

# బలోపేతమే లక్ష్యం

- కుటుంబ సమేతంగా ట్రంప్ రాక సంతోషకరం
- 21 వ శతాబ్దంలోనే ఇదొక కీలక ఘట్టం
- ఇరు దేశాల మధ్య మూడు కీలక ఒప్పందాలు
- ఆర్థిక, వాణిజ్య, రక్షణ సంబంధాలపై చర్చలు
- భారత ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ : భారత్-అమెరికా సంబంధాల బలోపేతమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర, డొనాల్డ్ ట్రంప్ మధ్య చారిత్రక హైదరాబాద్ హౌజ్ వేదికగా మంగళవారం ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. చర్చల అనంతరం ఇరు దేశాధినేతలు ఉమ్మడి మీడియా సమావేశంలో మాట్లాడారు. ముందుగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. కుటుంబ సమేతంగా ప్రెసిడెంట్ ట్రంప్ భారత్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. ట్రంప్ కుటుంబానికి, అమెరికా ప్రతినిధుల బృందానికి మరోసారి మోదీ హార్థిక స్వాగతం పలికారు. తన మిత్రుడు ట్రంప్‌నకు మొతెరాలో ఇచ్చిన అపూర్వ, సదా స్మరణీయ స్వాగతం ఇరు దేశాల సంబంధాల్లో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. గడిచిన ఎనిమిది నెలల్లో ట్రంప్‌తో తనకిది ఐదో భేటీ అని ప్రధాని తెలిపారు. భారత్-అమెరికా మైత్రి తరువాయి 2లో..



## తాజ్‌మహల్ సందర్శన గొప్ప అనుభూతి

- మహాత్మా గాంధీకి ఘన నివాళి
- భారత్‌తో ఒప్పందం కుదిరింది
- పాక్‌కు భారత్‌నుంచే హెచ్చరిక
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యద్భుతమైన తాజ్‌మహల్‌ను సందర్శించడం గొప్ప అనుభూతి కలిగించిందని హర్షం వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీకి నివాళులు అర్పించడం తన జీవితంలో గొప్ప విషయమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి.. ఒక ప్రదక్షిణ చేసిన ట్రంప్, మెలానియాలు ఒక్క నిమిషం పాటు మౌనం పాటించి, స్మృత్యంజలి ఘటించారు. ఈ సందర్భంగా సందర్శకుల పుస్తకంలో సంతకం చేసిన ట్రంప్.. సార్వభౌమ, అద్భుతమైన భారతదేశం వెంట అమెరికా ప్రజలు తరువాయి 2లో..



### అగ్రనేతల మధ్య జరిగిన ఒప్పందంలోని కొన్ని కీలక అంశాలు

- అంతర్గత భద్రతపై ఒకరికొకరు సహకరించుకుంటున్నాం
- మాదక ద్రవ్యాలు, నార్కో టెర్రరిజంపై ఉమ్మడి ఉక్కుపాదం
- మానవ అక్రమ రవాణాపై రెండు దేశాలు ఉమ్మడి పోరాటం
- రెండుదేశాల మధ్య ఇటీవల 20 బిలియన్ డాలర్ల వాణిజ్యం
- ఉగ్రవాదానికి ఊతమిచ్చేవారికి వ్యతిరేకంగా రెండు దేశాల పోరాటం
- ఆర్థిక సంబంధాల్లో పారదర్శక వాణిజ్యానికి కట్టుబడి ఉన్నాం
- అధ్యక్షుడు ట్రంప్ పర్యటన రెండు దేశాలకు కీలకం

# సీఎం జగన్ చర్యలు స్ఫూర్తిదాయకం

- మానవ వనరులపై పెట్టుబడి ద్వారా అభివృద్ధి ఫలితాలు
- ఏపీ అభివృద్ధిపై ప్రతినిధుల బృందంతో చర్చలు
- సీఎం జగన్‌తో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల సమావేశం



అమరావతి: ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. సచివాలయంలో జరిగిన ఈ భేటీలో వరల్డ్ బ్యాంక్ దక్షిణాసియా మానవ వనరుల అభివృద్ధి విభాగం రీజనల్ డైరెక్టర్ షెర్‌బర్న్ బెంజ్ తరువాయి 2లో..

## రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల నగారా

### ఏపీలో నాలుగు, తెలంగాణలో రెండు స్థానాలకు ఎన్నికలు

న్యూఢిల్లీ : మరో ఎన్నికల నగారా మోగింది. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లోని 55 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. మార్చి 26న ఎన్నికలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మార్చి 6న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 13వ తేదీ నామినేషన్ దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించారు. మార్చి 16న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 18 తరువాయి 2లో..

## చేయి చేయి కలుపుదాం గిరిజనాభివృద్ధికి కృషి చేద్దాం

- ఐటీడీఏ పీఓలే మూలస్తంభాలు
- గిరిజనాభివృద్ధికి వేలాది కోట్ల వ్యయం
- పాడేరు, సీతంపేట పి.ఓ.లకు అభినందనలు
- మన్యంలో సరైన రోడ్లు లేక డోలీ మోతలు
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి



విశాఖపట్నం: అందరం చేయి చేయి కలిపి గిరిజనాభి వృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి పిలుపు నిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖకు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులే మూలస్తంభాలని పేర్కొన్నారు. గిరిజనాభివృద్ధిలో విజయాలు, వైఫల్యాలకు పి.ఓ.లే ప్రధానమని స్పష్టం చేసారు. మంగళవారం స్థానిక హోటలో ఐ.టి.డి.ఎ. పి.ఓ లు, సబ్ కలెక్టర్లు, ఉప సంచాలకులు, జిల్లా గిరిజన సంక్షేమాధికారులు, గిరిజన సహకార సంస్థ అధికారులతో గిరిజన సంక్షేమ శాఖలో అమలవుతున్న తరువాయి 2లో..

## నవరత్న పథకాలు ప్రతీ పేదవాడి గడపకూ చేరాలి

- నాయకులు, అధికారులు పని చేయాలి
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం ఎనలేని కృషిచేస్తున్నారు
- భీమిలి నియోజకవర్గంలో వై.సి.పి ఎంతో బలంగా ఉంది
- రాష్ట్ర యువజన శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భీమునిపట్నం : విశాఖ జిల్లాలో మొట్టమొదటి సారిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం భీమిలి మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఉత్సాహపూరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు (అవంతి) అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా గాజువాక ఎంఎల్ఏ తిప్పల నాగిరెడ్డి, అనకాపల్లి ఎంఎల్ఏ గుడివాడ అమర్నాథ్, చోడవరం ఎం.ఎల్.ఎ కరణం ధర్మశ్రీ , పాయకరావుపేట ఎం.ఎల్.ఎ గొల్ల బాబురావు, టిటిడి డైరెక్టర్ కన్నబాబు జిల్లా ఎం.పీలు ఎం.వి.వి సత్యనారాయణ, అనకాపల్లి ఎం.పి బీశెట్టి వెంకట సత్యవతి , వి.ఎం.ఆర్.డి.ఎ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస రావు, ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అవంతి శ్రీనివాస రావు మాట్లాడుతూ విశాఖపట్నం రాజధానిగా ఈ ప్రాంతం ఏర్పడిన తరువాత భీమునిపట్నం మార్కెట్‌యార్డు ఛైర్మన్ తరువాయి 2లో..




మొదటి పేజీ తరువాయి

## భారత్-అమెరికా సంబంధాల బలోపేతమే లక్ష్యం



21వ శతాబ్దంలోనే కీలక ఘట్టమని ఆయన అభివర్ణించారు. ట్రంప్ తాజా పర్యటన ఇరు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేసిందన్నారు. తమ సమావేశాల్లో రక్షణ, భద్రత, టెక్నాలజీపై చర్చించామని మోదీ తెలిపారు. అత్యాధునిక రక్షణ, భద్రత, టెక్నాలజీపై చర్చించామని పేర్కొన్నారు. అత్యాధునిక రక్షణ ఉత్పత్తి సంస్థలు భారత్‌కు వస్తున్నాయని తెలిపారు. భారత రక్షణ వ్యవస్థలో ఈ సంస్థలు భాగస్వామ్యమవుతున్నాయని అన్నారు. సైనిక శిక్షణలో ఇరు దేశాలు ఒకరికొకరు సహకరించుకుంటున్నాయని గుర్తు చేశారు. ద్వైపాక్షిక వాణిజ్యానికి సంబంధించి రెండు దేశాల ఆర్థిక మంత్రుల మధ్య ఒక అవగాన కుదిరిందని చెప్పారు. అమెరికాతో ఓ భారీ ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నామని ప్రధాని వెల్లడించారు. అమెరికాకు ఉద్యోగాల కోసం వెళ్లిన భారతీయులు, ఇరు దేశాల మధ్య మెరుగైన సంబంధాలలో కీలక పాత్ర పోషిస్తున్నారి ఆనందం వ్యక్తం చేశారు.

## డీల్ దిశగా అడుగులు



భారత పర్యటనకు వచ్చినందుకు డొనాల్డ్ ట్రంప్‌కి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. మొతేరా స్టేడియంలో నిర్వహించిన నమస్తే ట్రంప్ కార్యక్రమాన్ని తాను గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. తాను మోదీ ప్రస్తావన తెచ్చినప్పుడల్లా ప్రజలు మరింతగా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారన్నారు. గడిచిన 8 నెలల్లో ఐదుసార్లు ట్రంప్‌తో సమావేశమయ్యానని ప్రధాని మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో రక్షణ, భద్రత, వాణిజ్య రంగాల్లో సహకారంపై చర్చించామన్నారు.

ఇంధన సహకారం గురించి ప్రత్యేకంగా చర్చించామన్నారు. సమాన అవకాశాలతో కూడిన స్వేచ్ఛా వాణిజ్యం దిశగా చర్చలు జరిపామన్నారు. దౌత్య సంబంధాల్లో రక్షణ సహకారం కీలకమైందన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులకు వ్యతిరేకంగా తాము పోరాడతామన్నారు. భారత్, అమెరికా సంబంధాలకు ప్రభుత్వాలతో సంబంధం లేదన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయన్నారు. రక్షణ శాఖకు అత్యాధునిక ఆయుధాల అంద బోతున్నా యన్నారు. భారత్-అమెరికా స్నేహబంధం 21వ శతాబ్దానికి ఎంతో ముఖ్య మన్నారు. భారత్‌లో తమకు అద్భుతమైన స్వాగతం లభించిందని ట్రంప్.. మహాత్మా గాంధీ ఆశ్రమాన్ని, రాజ్‌ఘాట్‌ను, తాజ్‌మహాల్‌ను సందర్శించడం ఆనందాన్ని ఇచ్చాయన్నారు. తన పర్యటన పలప్రదమైందని, ఈ టూర్ ఎంతో ప్రత్యేకమన్నారు. అపాచీ, ఎం-16 హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందం జరిగిందని ట్రంప్ తెలిపారు. 3 బిలియన్ డాలర్ల విలువైన రక్షణ ఒప్పందం కుదిరిందన్నారు. తాను అధ్యక్షుడయ్యాక భారత్‌తో ఆర్థిక సంబంధాలు మెరుగయ్యాయన్నారు.

## నవరత్న పథకాలు ప్రతీ పేదవాడి గడపకూ చేరాలి



కార్యకర్తలు తమవంతు కృషిచేయాలని కోరారు.

నవరత్న పథకాలు ప్రతీ పేదవాడి గడపకు చేరేలా నాయకులు, అధికారులు పని చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

అనంతరం, మంత్రి అవంతి శ్రీనివాస రావు చేతుల మీదుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ దాట్ల వెంకట అప్పల ప్రసాద రాజు (పెద్దబాబు) ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం, వైస్ ఛైర్మన్ పాపరావుతో పాటు మెంబర్లు అక్రమాని తులసి, ఆస్లామ్ ఖాన్, సర్వసిద్ధి లక్ష్మణ రావు, జలగడుగుల వేణు, నెలివాడ రమణమ్మ, గంగిరెడ్ల రమణమ్మ, పాలూరి నరసింగ రావు, ఒమ్మి అప్పరావు, కొప్పల రూప, గుడివాడ దివ్య, తమ్మిన ఆంజనేయులు, పసుమర్తి వెంకట నాగలక్ష్మి, బూర్లే చిన్నం నాయుడు, పి.ఎ.సి.ఎస్ పాండురంగలు ప్రమాణస్వీకారం చేసారు. సభ్యులందరిని మంత్రి అవంతి శ్రీనివాస రావు, ఎంపీలు, ఎంఎల్ఎలు అభినందించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వెంకట ఈశ్వర రావు, ఎం.డి ఓ. వెంకటరమణ, ఎ.డి.ఎం. ఎం.కాళేశ్వరరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.రామకృష్ణ, నియోజక వర్గ ఇంచార్జ్ ముత్తంశెట్టి మహేష్, డి.ఎల్.డి ఛైర్మన్ గాడు వెంకటప్పడు, మణి శంకర్ నాయుడు, బంగారునాయుడు, సుంకరి గిరిబాబు, ఎస్.రఘునాథ్ రెడ్డి, ఎస్.కరుణాకరరెడ్డి, జీరు వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

పదవికి వై.సి.పి అధికారంలో ఉండగా రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని చెప్పారు. వై.సి.పి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి, ప్రజల అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఎనలేని కృషిచేస్తున్నారని చెప్పారు. మార్కెట్‌యార్డు కమిటీ పాలకవర్గం రైతుల ప్రయోజనాల కొరకు నిరంతరం పనిచేసి రైతుల మన్ననలు పొందాలని మంత్రి కోరారు. రైతుల ప్రయోజనాల కొరకు పనిచేసే మార్కెట్ కమిటీలు ఇకనుండి రైతుల కోసమే పనిచేసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. బడుగు బలహీనవర్గాల మైనారిటీల ప్రజలకు వై.సి.పి లోనే ప్రయోజనం ఉందని చెప్పారు.

పార్టీ అభివృద్ధికి కృషిచేసి, పార్టీకి చేసిన సేవలను గుర్తించి దాట్ల వెంకట అప్పల ప్రసాద రాజు (పెద్దబాబు) కి ఛైర్మన్ పదవి ఇచ్చామని పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని ప్రజలకు సేవ చేస్తే శాశ్వతంగా పేరు నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు.

భీమిలి నియోజకవర్గంలో వై.సి.పి ఎంతో బలంగా ఉందని మరింత బలంగా పెంచేందుకు

# రాష్ట్రపతి భవన్‌లో ట్రంప్ దంపతులకు ఘన స్వాగతం

భారత పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు, ప్రధాని నరేంద్ర మోదీ ట్రంప్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం ట్రంప్ త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, సీడీఎస్ చీఫ్ బిపిన్ రావత్‌తో పాటు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాధిపతులు, కాన్సులేట్ సభ్యులను ట్రంప్‌కు మోదీ పరిచయం చేశారు.



### తాజ్‌మహల్ సందర్శన గొప్ప అనుభూతి


-----------------------

ట్రంప్, మెలనియా దంపతులకు అధికారులు రాజ్‌ఘాట్ గురించి వివరించారు. వీరివెంట కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ రాగా.. మహాత్మాగాంధీ జ్ఞాపికను ఆయన అందజేశారు. అదే విధంగా ప్రపంచంలోనే అత్యద్భుతమైన తాజ్‌మహల్‌ను సందర్శించడం గొప్ప



అనుభూతి కలిగించిందని హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఢిల్లీకి చేరుకున్న ట్రంప్ దంపతులు తొలుత రాష్ట్రపతి భవన్‌లో త్రివిధ దళాల గౌరవవందనం స్వీకరించారు. ఆ తర్వాత హైదరాబాద్ హౌజ్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. తనకు అద్భుత స్వాగతం పలికిన ప్రధాని మోదీ, భారత ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. భారత పర్యటనలో భాగంగా అత్యాధునిక సాంకేతికత కలిగిన అపాచీ, రోమియో హెలికాప్టర్ల కొనుగోలుతో పాటు.. 3 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా... ఉగ్రవాదాన్ని పెంచి ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌ను భారత గడ్డపై నుంచి ట్రంప్ హెచ్చరించారు. ఉగ్రవాదులను కట్టడి చేసేందుకు ఐక్యరాజ్యసమితితో కలిసి పనిచేస్తున్నామని... అతివాద ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని ఉమ్మడిగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు. అదే విధంగా భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని ఆశిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా భారత్- అమెరికా సంబంధాలు బలపడ్డాయన్న అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఢిల్లీలో ఐరాస డెవలప్‌మెంట్ ఫండ్ శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సహకారం అందిస్తామని తెలిపారు.

భారత పర్యటలో ఉన్న అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హైదరాబాద్ హౌజ్‌కు చేరుకున్నారు. మంగళవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన ట్రంప్.. అక్కడ త్రివిధ దళాల గౌరవవందనం స్వీకరించారు. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ, ట్రంప్ కలిసి హైదరాబాద్ హౌజ్‌కు వెళ్లారు. హైదరాబాద్ హౌజ్‌లో భారత్, అమెరికాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఇరు దేశాల మధ్య 300 కోట్ల డాలర్ల విలువైన డిఫెన్స్ డీల్‌తో పాటు ఐదు ఒప్పందాలు కుదిరింది. మోదీ, ట్రంప్ చర్చల్లో పలు ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.




## ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్

### విద్యనే కాకుండా మంచి నడవడిక నేర్పడం మంచిది



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల భారత పర్యటన సందర్భంగా ఆయన భార్య, అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ మంగళవారం ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఢిల్లీలోని సర్వోదయ స్కూల్‌లో హ్యాపినెస్ క్లాసులను ఆమె పరిశీలించారు. హైదరాబాద్ హౌజ్‌లో భారత ప్రధాని మోదీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలు జరిపారు. ఈ సమయంలో మెలానియా ట్రంప్ ఢిల్లీలోని సర్వోదయ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మెలానియాకు సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ పద్ధతిలో బొట్టు పెట్టి మంగళ హారతులతో మెలానియాను స్వాగతం పలికారు. చిన్నారుల స్వాగతానికి మెలానియా మురిసిపోయారు. అనంతరం ఓ తరగతి గదిలోకి వెళ్లిన మెలానియా విద్యార్థులతో ముచ్చటించారు. అక్కడి హ్యాపీనెస్ క్లాస్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు మహిళా టీచర్లు మెలానియా వెంట ఉన్నారు. టీచర్లు అడిగిన ప్రశ్నలకు చిన్నారులు చక్కగా సమాధానం చెప్పారు. పాటలు, సంగీతం, ఆటలపై తమకు ఉన్న మక్కువను వివరించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు చేసిన నృత్యాలను మెలానియా తిలకించారు. అనంతరం మెలానియా మాట్లాడుతూ.. పాఠశాల విద్యావిధానం చాలా బాగుందని కితాబిచ్చారు. విద్యార్థులు తనపై చూపించిన ప్రేమ, అప్యాయత మరవలేనిదన్నారు. ఈ పాఠశాలలో కేవలం విద్యనే కాకుండా మంచి నడవడికను నేర్పించడం బాగుందని మెలానియా పేర్కొన్నారు.




## చేయి చేయి కలుపుదాం.. గిరిజనాభివృద్ధికి కృషి చేద్దాం

సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. వెలుగు, గిరిజన సంక్షేమ శాఖ (విద్య) వై ఎస్.ఆర్ పెళ్లికానుక, అమ్మఒడి, జగనన్న వసతి దీవెల, అటవీహక్కుల చట్టం అమలు, జగనన్న విద్యాదీవెన పై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు వినూత్నంగా ఆలోచించాలని సూచించారు. ఐటిడిఎలలో ఐ.ఎ.ఎస్. అధికారులను నియమించడం జరిగిందని అభివృద్ధి చేసి తమ సత్తాను నిరూపించాలని పేర్కొన్నారు. గిరిజనాభివృద్ధికి వేలాది కోట్లు ఖర్చు చేస్తున్నా గిరిజన ప్రాంతాలలో మార్పులు రావడం లేదన్నారు. కొండ శిఖర గ్రామాలకు సరైన రోడ్లు లేక డోలీ మోతలు తప్పడం లేదన్నారు. సీతంపేట ప్రాంతంలో రోడ్లు త్వరితగతిన పూర్తి చేయడానికి పి.ఓ కృషి చేస్తున్నారని అభినందించారు. కంటైనర్ కార్పోరేషన్‌తో చర్చించి అంబులెన్సులు సమకూర్చిన పాడేరు ప్రాజెక్టు అధికారి బాలాజీ డి.కె.ను అభినందించారు. విద్యావవస్థలో మార్పులు తీసుకుని రావాలని పేర్కొన్నారు. పి .ఓ లు విస్తృతంగా క్షేత్ర పర్యటనలు చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నా రన్నా రు. విద్యా నైపుణ్యాలు, బోధనా సామర్థ్యాలు లేని సి ఆర్ టిల పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టు అధికారులకున్న విశిష్టమైన అధికారాలు వినియోగించాలని స్పష్టం చేసారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ప్రతీ మూడు నెలలకు ఐటిడిఎ పాలక వర్గ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో ఒక ఫ్యాను, ఒక బల్బు ఉంటే వేలల్లో బిల్లులు వస్తున్నా, ట్రాన్స్ కో అధికారులు తగిన చర్యలు చేపట్టడం లేదన్నారు. ట్రాన్స్ కో, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఐటిడిఎలలో దీర్ఘకాలం పని చేస్తున్న ఉద్యోగులను ప్రక్షాణన చేయాలని సూచించారు.

గిరిజన సంక్షేమ ఉపా ద్యాయులకు సబ్జెక్టుల వారిగా శిక్షణ అందించ వలసిన అవసరం ఉందని పాడేరు ఐటిడిఎ పి .ఓ డి.కె.బాలాజీ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారు. ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం .రవిచంద్ర మాట్లాడుతూ 100 యూనిట్ల నుండి 200 యూనిట్ల విద్యుత్తును పెంచి ఉచితంగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు రంజిత్ భాషా, జి.సి.సి. ఎం.డి పి.ఎ శోభ, పార్వతీపురం ఐటిడిఎ పి.ఓ డా.బి.ఆర్ అంబేద్కర్, సీతంపేట పి.ఓ సాయికాంతవర్మ, ట్రైకార్ యండి . ఇ. రవీంద్రబాబు, ఇ.ఎన్.సి. శేషుకుమార్, పలువురు సబ్ కలెక్టర్లు, గిరిజన సంక్షేమ శాఖ డిడిలు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ చర్యలు స్ఫూర్తిదాయకం

ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రపంచ బ్యాంక్ నిధులతో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టులపై సీఎం వారితో చర్చించారు.

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల బృందం ప్రశంసలు కురిపించింది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలు స్ఫూర్తిదాయకమని వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు కొనియాడారు. మానవ వనరులపై పెట్టుబడి ద్వారా అభివృద్ధి ఫలితాలు వస్తాయని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల బృందం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతామని ప్రతినిధులు వెల్లడించారు.

## రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల నగారా

చివరి తేదీ. మార్చి 26న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ చేపడతారు. ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలకు, తెలంగాణలో రెండు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి.

ఏపీలో కె.కేశవరావు, ఎంఎ ఖాన్, టి.సుబ్బరామిరెడ్డి, తోట సీతారామలక్ష్మీ, తెలంగాణలో కేవీపీ, గరికపాటి రాంమోహన్‌రావు పదవీ కాలం ముగుస్తుంది. దీంతో ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

## శిక్షణలో ఉన్న ఐఏఎస్‌ల బృందం పోర్టు సందర్శన

పోర్టు కార్యకలాపాలని వివరించిన పోర్టు డెప్యూటీ చైర్మన్ హరనాథ్



విశాఖపట్నంః శిక్షణలో ఉన్న ఐఏఎస్‌ల బృందం తమ శిక్షణలో భాగంగా విశాఖపట్నం పోర్టు ట్రస్టును మంగళవారం సందర్శించింది. పోర్టు డెప్యూటీ చైర్మన్ పి. ఎల్. హరనాథ్ శిక్షణలో ఉన్న ఐఏఎస్‌లకు సాదర స్వాగతం పలికారు.

పోర్టు పరిపాలనా కార్యాలయంలోని బోర్డ్ రూంలో ట్రైనీ ఐఏఎస్‌లకు పోర్టు కార్యకలాపాలపై డెప్యూటీ చైర్మన్ పి. ఎల్. హరనాథ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోర్టులో ఉన్న మౌలిక వసతులు, ఎగుమతులు , దిగుమతులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు. పోర్టులో ఆధునికీకరణ, యాంత్రీకరణ అంశాలను, 100 శాతం సోలార్ విద్యుత్తు వినియోగిస్తున్న తీరును వారికి తెలియజేశారు. పోర్టు అంతర్గత అవసరాలకోసం వినియోగిస్తున్న నీటిశుద్ధి ప్రక్రియను వివరించారు. పెట్టుబడి అవకాశాలు, ఎగుమతులు, దిగుమతుల మెరుగుదలకు సంబంధించి అందుబాటులో ఉన్న అంశాలను వివరించారు. ఈ సందర్భంగా శిక్షణా ఐఏఎస్‌లు పోర్టుకు సంబంధించిన పలు ప్రశ్నలకు డెప్యూటీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. శిక్షణా ఐఏఎస్‌ల ప్రశ్నలకు డెప్యూటీ చైర్మన్ పి. ఎల్. హరనాథ్ వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు. శిక్షణా ఐఏఎస్‌లు లేవనెత్తిన పలు అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సమావేశానికి పోర్టు వివిధ విభాగాధిపతులు హాజరయ్యారు.

## క్యాన్సర్ రోగికి యంపీ ఎంవీవీ బాసట

రూ.3 లక్షల పీఎంఎన్ఆర్ఎఫ్ కేటాయింపు



విశాఖపట్నం : వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ ఆసుపత్రిలో కాన్సర్ తో బాధపడుతున్న ఓ వ్యక్తికి విశాఖ యంపీ ఎంవీవీ సత్యనారాయణ బాసటగా నిలిచారు. విశాఖ నగరానికి చెంది ప్రస్తుతం పుదుచ్చేరిలో నివాసముంటున్న కామన వెంకట నారాయణ గత కొంత కాలంగా ఈ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స చేయాలని వైద్యులు సూచించడంతో ఆ కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయార్థం యంపీ ఎంవీవీని ఆశ్రయించారు. స్పందించిన యంపీ ఎంవివి సత్యనారాయణ ప్రధాన మంత్రి నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద దరఖాస్తు చేయించారు. తదుపరి ఆసుపత్రి ఖర్చులకు రూ.3 లక్షల మంజూరు కేంద్రం నుంచి లభించింది. ఆ మంజూరైన. పత్రాన్ని ఎంవీపీ కాలనీలో ఉన్న విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పార్టీ ఆఫీసులో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ ఆర్థికంగా పరిపుష్టి లేని తమకు దన్నుగా నిలిచి, ఈ సహాయం తమకు అందజేసేందుకు కృషిచేసిన విశాఖ యంపీ ఎంవీవీ సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. యంపీ మాట్లాడుతూ తన పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరికీ తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ



విశాఖ సిటీః జి.వి.ఎం. సి. జోన్-3 దక్షిణ నియోజక వర్గం 27 మరియు 28వ వార్డ్‌లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ వార్డ్ వైఎస్సార్సీపీ. కార్యకర్తలతో చేయించారు,

ఈ వార్డ్‌లలో 2 టౌన్ పోలీస్ స్టేషన్ నుండి సరస్వతీ పార్క్ సర్కిల్ (వయ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీస్) బి టీ.రోడ్స్ కొరకు రూ. 16లక్షలు, 28వార్డ్‌లో గోవిందా రోడ్డు, సాయిబాబా స్ట్రీట్, నారాయణ స్ట్రీట్, వెంకటేశ్వర మెట్ట మరియు కుమారి వీది పనులకు రూ. 18 లక్షల 80 వేలుతో, గొల్లాల సందు, పేర్ల వీది, సి సి.రోడ్డు, సి సి.డ్రెయిన్లు నిర్మాణం కొరకు రూ. 14 లక్షలు, మొత్తం ఈ రెండు వార్డ్‌లలో 49 లక్షల ఎనబై వేల రూపాయలు పనులకు భూమి పూజ చేశారు,

ఈ కార్యక్రమంలో జి వి ఎం సి అధికారులు ఇ ఇ. గణేష్, డి ఇ. సంతోషి, ఎ ఈ పార్వతి, ఎ ఇ ఇ. ఉరాణి మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రంధి గోపి, భత్తిన నాగరాజు, కె.బ్రహ్మం, రామారావు, బి. ప్రసాద్, పి. శ్రీనివాస్, ప్రెమ్మాస్టర్, అర్.గోపి, భవాని రెడ్డి, చిట్టెమ్మ, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, పాల్గొన్నారు,

## ఎస్బిఐ ఆలిండియా ఇంటర్ సర్కిల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్



విశాఖ సిటీః స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 24.02.2020 నుండి 28.02.2020 వరకు విశాఖపట్నంలో ఆల్ ఇండియా ఇంటర్ సర్కిల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తోంది. టోర్నమెంట్ 2 వ రోజు 12 జట్లలో 6 మ్యాచ్‌లు జరుగుతున్నాయి. మొదటి మ్యాచ్ కేరళ మరియు కోల్‌కతా సర్కిల్ మధ్య జరిగింది. కేరళ 3 గోల్స్ సాధించగా, కోల్‌కతా నిల్ గోల్‌తో ఉంది. సుబీర్ ఘోష్‌ను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రకటించారు. చెన్నై మరియు నార్త్-ఈస్ట్ సర్కిల్ మధ్య జరిగిన మ్యాచ్‌లో, నార్త్-ఈస్ట్ సర్కిల్ 5 గోల్స్ చేసి అద్భుత ప్రదర్శనతో విజేతగా అవతరించింది మరియు చెన్నై సర్కిల్‌కు చెందిన అబ్దుల్ కరీమ్‌ను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రకటించారు.

ఢిల్లీ మరియు పాట్నా సర్కిల్స్ మధ్య జరిగిన మ్యాచ్ చాలా ఆసక్తికరంగా జరిగింది. ఇందులో ఢిల్లీ 3 గోల్స్ చేసి విజేతగా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గ్రహీత ఢిల్లీ కి చెందిన జాకబ్ శామ్యూల్. నాల్గవ మ్యాచ్ ముంబై మరియు లక్నో మధ్య జరిగింది. ముంబై 2-1 తో విజేతగా నిలిచింది.

5 వ మ్యాచ్ హైదరాబాద్ మరియు భోపాల్ మధ్య జరిగింది. హైదరాబాద్ 6-1 తో విజేతగా నిలిచింది.

6 వ మరియు ఈరోజుకి చివరి మ్యాచ్ కేరళ మరియు చండీగర్ మధ్య ఇప్పుడే ప్రారంభమై ఆసక్తికరంగా సాగుతుంది.

## మధురవాడలో జోనల్ కమిషనర్ పర్యటన



మధురవాడ : మహా విశాఖ జోన్ వన్ 5వ వార్డులో గల బాపూజీ నగర్, శ్రీనివాస్ నగర్ తదితర ప్రాంతాలలో జోన్ వన్ కమీషనర్ బి.రాము పర్యటించారు, కాలనీ వాసుల ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ప్రధానంగా పార్కులు అభివృద్ధి, రహదారులు, కాలువలు మరియు గెడ్డలుతదితర సమస్యలను కాలనీ వాసులు జోనల్ కమిషనర్ దృష్టికి తెచ్చారు, అక్కడే ఉన్న నగరప్పాలెం వెళ్లే మాష్టర్ ప్లాన్ రోడ్డు ప్రక్కన గల పెద్ద గెడ్డను పరిశీలించారు, అలాగే సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కాలనీ వాసులు కోరారు. ఈ పర్యటనలో వైసీపీ 5వ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, నాయకులు కుడితి రామారావు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పి.వి.జి అప్పారావు, పసుపులేటి గోపి, పిల్లా సూరిబాబు, బంగారు ప్రకాష్, యన్.బాబ్జీ, జె.యస్.రెడ్డి, అల్లాడ లింగేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సెక్రటరీలు, వార్డు వాలంటర్లు తదితరులు పాల్గొన్నారు.



*భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించినటువంటి రాజ్యాంగ స్ఫూర్తిని, విలువల్ని అనుక్షణం కాపాడుతూ రాజ్యసభలో తన ప్రసంగాలతో తనకంటూ ఒక ముద్రను ఏర్పరుచుకుని ది బెస్ట్ ప్రెజెంటర్ గా నిలిచి తెలుగువారి కీర్తి పతాకాన్ని రాజ్యసభ వేదిక రెపరెపలాడించిన అపర రాజకీయ చాణిక్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు శ్రీ వేణుంబాక విజయసాయిరెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలుసుకుని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు గ్రేటర్ విశాఖ యువజన అధ్యక్షులు కొండా రాజీవ్ గాంధీ*

# కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం

## శాసన సభాపతి తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం: కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేయనున్నట్లు రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం తెలిపారు. మంగళవారం ఆమదాలవలస నియోజకవర్గం, పొందూరు మండలం, లైదాం గ్రామంలో రూ. రూ. 8.56 కోట్ల అంచనా వ్యయంతో ఎత్తిపోతల పథకానికి (రెల్లి గెడ్డపై ) హెడ్ వర్క్స్ పనులకు శాసన సభాపతి తమ్మినేని సీతారాం, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖామంత్రి ధర్మాన క్రిష్ణ దాస్‌తో కలిపి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా శాసన సభాపతి తమ్మినేని సీతారాం మాట్లాడుతూ, లైదాం ఎత్తిపోతల పథకం పూర్తి కాబడితే 1174 ఎకరాలు సస్యశ్యామలం కానున్నాయన్నారు. లైదాం, కొంచాడ, పొందూరు, రాపాక, వాండ్రంగి, కొల్లిపేట గ్రామాలలోని 1250 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 110 హార్స్ పవర్ తో మూడు పంపుల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రోజు రైతాంగం హృదయాలలో స్థానం పొందిన రోజు అని అన్నారు. ముఖ్యమంత్రి మానవతావాది అని, రైతు పక్షపాతి అని, ఆయకట్టు పనులకు ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. లైదాం, తండ్యాం, రెల్లిగెడ్డ, మడ్డువలస, ఓనిగెడ్డ, నారాయణపురం పనులపై ముఖ్యమంత్రి వద్ద ఫైల్ పెట్టగానే స్పందించారని తెలిపారు. లైదాం, తండ్యాం పనులకు పాలన, సాంకేతిక, ఆర్థిక అనుమతులు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. లైదాం ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు తండ్యాం ఎత్తిపోతల పథకానికి రూ.26 కోట్లు అవసరమని, దీని ద్వారా సుమారు రెండు వేల ఎకరాలకు లబ్ధి చేకూరుతుందని వచ్చే నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మడ్డు వలస పనులకు రూ.18 కోట్లు అవసరమని చెప్పారు. నారాయణపురానికి కింది ఆయకట్టుకు నీరందించడం, నీటి స్థిరీకరణ పనులను చేపట్టవలసిన అవసరం వుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేసి రైతాంగానికి తాగు, సాగు నీరందిస్తామన్నారు. కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజల తీర్పుకు న్యాయం చేస్తామన్నారు. కరువు ప్రాంతాలకు నీరందించే భగీరధ ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. రహదారులు, భవనాల శాఖామాత్యులు ధర్మాన కృష్ణ దాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతుల పక్షపాతి అని, రైతాంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. విద్య వైద్యం, సంక్షేమ రంగాల కు పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. ఈ రోజు ఎత్తిపోతల పథకం పూర్తయితే ఆరు గ్రామాలకు సాగునీరందుతుందన్నారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి ప్రారంభోత్సవం చేసి రైతులకు ప్రయోజనం కలిగించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నదన్నారు.

ముఖ్యమంత్రి అమ్మ ఒడి, రైతు భరోసా, 50శాతం మహిళలకు రిజర్వేషన్ లు, దిశ చట్టం అమలు సచివాలయాలు, వాలంటీర్స్ వ్యవస్థ ఏర్పాటు వంటి కార్యక్రమాల ద్వారా అవినీతి రహిత, పారదర్శక పాలన అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన తమ్మినేని చిరంజీవి నాగ్ మాట్లాడుతూ, వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను, ఎన్నికల మేనిఫెస్టోను తొమ్మిది నెలల కాలంలో 80 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ, యువజన శ్రామిక రైతు పార్టీగా మంచి సేవలను అందించనున్నట్లు తెలిపారు. అనంతరం సభాపతి, మంత్రివర్యులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీ-2 ఆర్.గున్నయ్య, తహశీల్దార్ టి.రామకృష్ణ, ఎం.డి.ఓ. బొడ్డేపల్లి మధుసూదన రావు, కొంచాడ రామమూర్తి, సువ్వారి గాంధీ, గంట్యాడ రమేష్, లోలుగు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



## చదువులో ఉండే నిజమైన ఆనందాన్ని ఆస్వాదించండి



సాగర్‌నగర్ : గీతంలో బ్రహ్మకుమారి ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మృత్యుంజయ తల్లితండ్రుల ఆకాంక్షలను, జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలను ప్రతిరోజు మననం చేసుకుంటూ అనవసర విషయాలకు, ఆకర్షణలకు లోనుకాకుండా చదువులో ఉండే నిజమైన ఆనందాన్ని యువత ఆస్వాధించాలని బ్రహ్మకుమారి ఎగ్జిక్యూటివ్ సెక్రిటరీ రాజయోగి డాక్టర్ మృత్యుంజయ పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. చదువు కేవలం సంపాదన కోసమే కాదని, మనసులో ఒత్తిడిని తగ్గించుకొని ఆద్యాత్మికను పెంపొందించుకోవాలని, జీవతం అందమైన నందన వనం లాంటిదని నిర్లక్ష్యంగా వ్యవహరింస్తే ఆందోళనకరంగా మారుతుందని గ్రహించాలన్నారు. మొబైల్ ఫోన్‌ల వాడకం, ఫేస్‌బుక్, ఛాటింగ్‌లు, సినిమాలతో లభించే ఆనందం తాత్కాలికమనేది గుర్తించాలన్నారు. వైఫల్యాల నుంచి పాఠాలను నేర్చుకుంటూ జీవితంలో ఆనందంగా ఎదగడానికి మనోస్థైర్యం అవసరమన్నారు. యుక్త వయస్సులో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని శరీరాన్ని కాంతి వంతంగా ఉంచుకోవాలంటే దుర్వ్యసనాలకు దూరంగా ఉండటం మంచిదన్నారు.మనలో అజ్ఞానమనే అందకారాన్ని విడనాడి ఆద్యాత్మికతను పాటించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై కోపాన్ని తగ్గించి వారిపై ప్రేమాబిమానం చూపాలన్నారు. అందరూ అద్యాత్మికతో కూడిన ఆలోచనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎమ్.భరత్, గీతం వైస్ ఛాన్సలర్ కె.శివరామకృష్ణ బ్రహ్మకుమారి ఎగ్జిక్యూటివ్ సెక్రిటరీ రాజయోగి డాక్టర్ మృత్యుంజయను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.వి.రావు, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు, ఫార్మశీ ప్రిన్సిపాల్ ఎస్.గణపతి, విద్యార్థి వ్యవహారాల డైరక్టర్ కె.వీరబధ్రం, విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు, బ్రహ్మకుమారి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను
## సంపాదకీయం

## చికెన్ చిక్కులు

డబ్ల్యూటీవో నిర్ణయం నేపథ్యంలో భారత్ దగ్గర రెండే మార్గాలున్నాయి. తక్కువ ధరకే అందుబాటులోకి రానున్న అమెరికా కోడి మాంసం ధరలను తట్టుకోవాలంటే దేశీయంగా భారీగా దాణా ఖర్చులను తగ్గించేలా సబ్సిడీలు ఇవ్వాలి. ఒక్క కాళ్ళు మాత్రమే కాకుండా మొత్తం కోడి దిగుమతులను మాత్రమే అమెరికా నుంచి భారత్ అనుమతించాలి. దేశంలో జన్యుమార్పిడి కోడిమాంసం దాణా ఉత్పత్తులు దిగుమతి కాకుండా ఆంక్షలు విధించాలి. భారత్‌లో పర్యటిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బృందంలో చర్చకు రానున్న ప్రధాన అంశాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, కోడికాళ్లు, డైరీ ఉత్పత్తుల దిగుమతులు ఉండనున్నాయి. గత పదేండ్లుగా కోడికాళ్ల దిగుమతి చుట్టూ వివాదం కొనసాగుతున్నది. డబ్ల్యూటీవోలో అమెరికాకు అనుకూలంగా నిర్ణయాలున్నాయి. భారత్ కచ్చితంగా అమెరికా నుంచి కోడికాళ్లు దిగుమతి చేసుకోవలసిందేనని డబ్ల్యూటీవో చెప్పింది. భారత్ దీన్ని వాయిదా వేస్తూ వస్తున్నది. ఈ పర్యటనలో కచ్చితంగా రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చే అవకాశమున్నది. ప్రధానంగా దిగుమతి సుంకంపైన వివాదం ముడిపడి ఉంది. ప్రస్తుతం భారత్‌లో కోడికాళ్ల దిగుమతి సుంకం 100 శాతం ఉంది. దీన్ని 25-30 శాతం తగ్గించడానికి సిద్ధంగా ఉంది. అయితే దీన్ని 10శాతానికి తగ్గించాలని అమెరికా కోరుతున్నది. దిగుమతి సుంకాలు భారీగా తగ్గిస్తే దేశీయంగా కోడి మాంసపు పరిశ్రమ భారీగా దెబ్బతింటుందని భారతీయ వ్యాపారస్థులు భయపడుతున్నారు. దేశంలో వినియోగదారులు కోడికాళ్లను ఇష్టపడుతారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యేవి కోడికాళ్లే కాబట్టి దేశీయ పౌల్ట్రీరంగం పోటీ తట్టుకోలేక చతికిలపడే అవకాశాలు ఎక్కువ. 2011లో ఏవియన్ ఇన్ ఫ్లూయంజా భయంతో భారత్ అమెరికా నుంచి కోడిమాంసం ఉత్పత్తులపై నిషేధం విధించింది. ఫలితంగా ఆ సంవత్సరం నుంచి అమెరికా నుంచి కోడి మాంసం, గుడ్లు, పందిమాంసం మన దేశంలోకి అనుమతించడం లేదు. దీనిపై 2011 అక్టోబర్‌లో ప్రపంచ వాణిజ్య సంస్థ వద్ద అమెరికా ఫిర్యాదు చేసింది. డబ్ల్యూటీవో అంతర్జాతీయ నిబంధనలు పాటించకుండా భారత్ డబ్ల్యూటీవో సభ్య దేశాల నుంచి దిగుమతులు నిరాకరిస్తున్నదని ఆరోపిస్తున్నది. ఈ విషయంలో డబ్ల్యూటీవో అమెరికాకు వత్తాసు పలికింది. 2015 జనవరిలో భారత్ అభ్యంత రం చెప్పటంతో అప్పిలేట్ బాడీకి అప్పగించింది. భారత్ అక్కడ కూడా ఓడిపోవటంతో 450 కోట్ల డాలర్లు అమెరికాకు సాలీనా భారత్ చెల్లించాలి లేదా దిగుమతులు అనుమతించాలని డబ్ల్యూటీవో ఆదేశించింది. నిర్ణీత కాలవ్యవధిలో దిగుమతులకు భారత్ సరే అనాలి. దీనికి 2016 జూన్ 19 వరకు భారత్‌కు సమయం ఉండేది. డబ్ల్యూటీవో నిబంధనల ప్రకారం కోళ్లు, కోళ్ల మాంసం దిగుమతికి సంబంధించి నూతన మార్గదర్శకాలను కేంద్ర పశుసంవర్ధక శాఖ ప్రకటించింది. దీని ప్రకారం.. భారత్‌లో జన్యుమార్పిడి చేసిన దాణా వేసిన కోళ్లు, మాంసం, శీతలీకరణ మాంసం భారత్ నిరాకరించరాదు. అమెరికాకు భారత్ అతిపెద్ద కోడి మాంసం విఫణి. మన దేశంలో చికెన్ మార్కెట్‌లో సాలీనా 12 శాతం వృద్ధి నమోదవుతున్నది. 2016లో సరాసరిన 92.1పౌండ్ల సరాసరి వినియోగం నమోదైంది. అందుకే అమెరికా భారత్ మార్కెట్‌ను వదులుకునేందుకు ఇష్టపడటంలేదు. దీనికితోడు యాంటీ బయోటిక్స్ అధికంగా వాడటం, కాళ్లకు ఇవి ఇవ్వటంతో, ఆ రసాయనాల అవశేషాలు కాళ్లలో ఉండటం అమెరికన్లకు నచ్చదు. అందుకే అమెరికాలో కోడి ఛాతీభాగాలకే డిమాండ్ ఎక్కువ. కాళ్లకు స్థానికంగా మార్కెట్ లేకపోవటంతో శీతలీకరణ చేసి వాటిని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. అమెరికాలో 2014లో కోటి 73 లక్షల టన్నులు కోడి మాంసం ఉత్పత్తిఅయితే, అందు లో 37లక్షల టన్నులు ఎగుమతి చేశారు. అందులో కాళ్లు 17కోట్ల టన్ను లు. భారత్ మొత్తం ఉత్పత్తి 37లక్షల టన్నులు. ప్రపంచంలో కాళ్ల మాం సం ఉత్పత్తిలో 5వ స్థానం. మొదటి స్థానంలో అమెరికా, ఆ తర్వాత బ్రెజిల్ (1.27 కోట్ల టన్నులు), చైనా (1.3 కోట్ల టన్నులు), ఐరోపా యూనియన్ (1.3 కోట్ల టన్నులు). భారత్‌లో ప్రతి నెల సరాసరిన 30 కోట్ల బ్రాయిలర్ కోళ్లు వినియోగం ఉంటే, అందులో ప్రాసెస్ చేసినవి 5 శాం కంటే తక్కువ. ఇక కోడి కాళ్లు ప్రత్యేకంగా చూస్తే మొత్తం కోళ్ల పరిశ్రమలో 2.2 శాతమే. కానీ డబ్ల్యూటీవో నిర్ణయంతో అమెరికా నుంచి కోట్ల టన్నుల కోడి కాళ్లు అత్యంత చౌకగా మన దేశంలోకి వచ్చిపడనున్నాయి. తాజా కోడి మాంసం, కాళ్ల ధర కిలోకు రూ.150 నుంచి రూ.175 ఉంటే అమెరికా నుంచి దిగుమతి చేసుకునే కాళు కిలో ధర.రూ.60 నుంచి 70 మాత్రమే. అంటే సగం ధరకే అవి లభ్యమవుతాయి. దేశంలో ఫ్రోజెన్ చికెన్ మార్కెట్ ప్రారంభదశలో ఉంది. పెరుగుతున్న పట్టణీకరణ, మారుతున్న జీవనశైలి, పాశ్చాత్య ధోరణులతో ఫ్రోజెన్ చికెన్ మార్కెట్‌లో సాలీనా 3నుంచి 5శాతం వృద్ధి రేటున్నది. ఈ మార్కెట్‌ను చేజిక్కించుకోవటం భారత్, అమెరికాలు రెండింటికీ కీలకమే.

## విద్యుత్ అంతరాయాలను అరికట్టాలి ముఖ్య మంత్రి




శ్రీకాకుళం : విద్యుత్ అంతరాయాలను అరికట్టాలని రాష్ట్ర ముఖ్య మంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో విద్యుత్ అంతరాయలపై పిర్యాధులు అందుతున్నాయని వాటిపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి మంగళ వారం వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. గ్రామ సచివాలయాల్లో నిర్వహించే స్పందనలో వచ్చే ఆర్జీలపై దృష్టి సారించాలని అన్నారు. అక్రమ మద్యం, శాంతిభద్రతల పై వచ్చే ఆర్జీపై పోలీసు సూపరింటిండెంట్ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి వచ్చే ఆర్జీలకు రెడ్ ఫ్లాగ్ ఉండాలని, పరిష్కరించిన అనంతరం గ్రీన్ ఫ్లాగ్ తో వెళ్ళాలని సూచించారు. ఉన్నత స్థాయి అధికారుల వరకు పరిష్కారానికి సంబంధించిన అలెర్ట్ లు వెళ్ళాలన పేర్కొన్నారు. పరిష్కరించిన సమస్యలకు అకనాలెడ్జ్మెంట్ (రశీదులు) తీసుకోవాలని అన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు విధిగా హాజరు వేసుకోవాలని చెప్పారు. గృహ పట్టాల పంపిణీకి యుద్ధప్రాతిపదికన పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 13 వేల ఎకరాలను భూసేకరణ చేయాలని చెప్పారు. లే అవుట్లు సిద్ధం చేయాలని, ఇందుకు వేగాన్ని పెంచాలని అన్నారు. మార్చి 1 నాటికి గృహ పట్టాల ప్రక్రియ పూర్తి కావాలని పేర్కొన్నారు. స్థలాల పంపిణీకి లాటరీ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని సూచించారు. మానవతాదృక్పథంతో పనిచేయాలని అన్నారు. గృహాలు వాలంటీర్ల మ్యాపింగ్ పక్కగా జరగాలని తెలిపారు. బియ్యం, పింఛను కార్డుల పంపిణీ జరగాలని, దిశా చట్టాన్ని బాగా అమలు చేయాలని ఆదేశించారు. అప్పుడప్పుడు మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తూ దిశా కేంద్రం చక్కగా పనిచేసేటట్లు చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమ మద్యం అరికట్టేందుకు మహిళా పోలీసు, మహిళా మిత్రులను వినియోగించుకోవాలని ఆదేశించారు. మహిళా పోలీసు, మహిళా మిత్రులను ఎస్పీలు పర్యవేక్షించాలని అన్నారు. అక్రమ మద్యం అరికట్టాలని, అక్రమ మద్యాన్ని తయారు చేసే వారికి రూ. 2 లక్షల వరకు అపరాధ రుసుము వేయవచ్చని చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవినీతి నిర్మూలనపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలిని అన్నారు. జిల్లా కలెక్టర్లు దృష్టి సారించకపోతే అవినీతి నిర్మూలన సాధ్యం కాదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జె నివాస్ మాట్లాడుతూ గృహ స్థలాల ప్రక్రియ మార్చి10 నాటికి పూర్తి చేస్తామన్నారు. గృహ పట్టాల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పోలీసు సూపరింటిండెంట్ ఆర్.ఎన్. అమ్మిరెడ్డి మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో దిశా కేంద్రాన్ని ఏర్పాటు చేసామన్నారు. జిల్లా కలెక్టర్ రూ.11 లక్షలు మంజూరు చేశారని ఆ నిధులతో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. మార్చి 1నాటికి ప్రారంభానికి సిద్ధం కానుందని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా పోస్టులను భర్తీ చేసామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు, నగర పాలక సంస్థ కమీషనర్ ఎం.గీతా దేవి, ముఖ్య ప్రణాళిక అధికారి ఎం.మోహన రావు, వ్యవసాయ శాఖ జెడి కె. శ్రీధర్, డీఆర్డీఏ పిడి ఏ.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పరిషత్ సిఇఓ జి.చక్రధర రావు, డిపిఓ వి.రవికుమార్, డిసిసిబి ఓఎస్డి బి.నగేష్, ఇపిడిసిఎల్ ఏడిఇ మోహన్ చక్రవర్తి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఎపిడి లక్ష్మీపతి, డిటిసి డా వడ్డి సుందర్, డిఎస్పి కృష్ణ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## విజయరామరాజుపేటలో 27న మరిడిమాంబ ఉత్సవం



అనకాపల్లి : పట్టణంలోని విజయ రామరాజుపేటలో ఈనెల 27న ఘనంగా మరిడిమాంబ ఉత్సవం నిర్విహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మరిడిమాంబ అమ్మవారి ఉత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ ఆవిష్కరణ నిర్వాహకులు చేపట్టారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామసత్యనారాయణ, ఉపాధ్యక్షులు బొట్టా అప్పారావు నాయుడు, కార్యదర్శి పలకా రాము, కోశాధికారి పిట్ల బుడ్డీశ్వరరావు, మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఈ ప్రాంతంలో ఉన్న గవర, కాపు, శెట్టిబలిజ, యాదవులతో పాటు, ఇతర కులాలలను కలుపుకుని ఉత్సవం ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాదికూడా ఉత్సవ నిర్వాహణకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అమ్మవారి భాగోతం పుట్టుక కథ, బుధవారం ఏర్పాటు చేసామన్నారు. గురువారం అమ్మవారి ఊరేగింపు సాయంత్రం జాతర జరుగుతుందన్నారు. పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలు సెట్టింగులు సాంస్కృతిక కార్యక్రమాలు జానపద కళారూపాల ప్రదర్శన జరుగుతుందన్నారు. అధికారుల ఆదేశాల మేరకు సాయంత్రం 7 గంటల నుండి 12 గంటల వరకు ఉత్సవం జరుగుతుంధని చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సంగీత విభావరి, డ్యాన్స్‌షో, సినీడూప్స్ ప్రదర్శన బాణాసంచా ప్రదర్శన, డార్క్ నైట్ డ్యాన్స్ హంగామా, బాలనాగమ్మ బుర్రకథ, భాగవతం గంటసాల భక్తిగీతాలు వంటి, కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారికోసం ప్రసాద వితరణ ఐదు చోట్ల ఏర్పాటు చేసామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుండల రామకృష్ణ, ఆడారి కుమారస్వామి, ఆళ్ల సూరిరామకృష్ణ, ఆళ్ల పెంటారవు, దాడి నాగు, పలకా సత్యనారాయణ, ఉగ్గిన నర్సింగరావు, యల్లంకి సత్తిబాబు, బర్నికాన గోవింద, తదితరులు పాల్గొన్నారు.



**పొందూరు చేరుకున్న మంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను శాలువాతో సత్కరించి ఆహ్వానిస్తున్న శాసనసభాపతి తమ్మినేని సీతారాం.**

## అరకు ఉత్సవాలను రద్దు చేయాలి - ఆదివాసి జేఏసి



అనంతగిరి : విశాఖ ఏజెన్సీలో ఆదివాసీలు హక్కులు కోల్పోయి ఉద్యమాలతో రగిలిపోతుంటే ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని వెచ్చించి ఆరుకు ఉత్సవాలను నిర్వహించడం విడ్డురంగా ఉందని ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలో గల ఉద్యోగుల భవన్లో జేఏసీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసేతరుల అక్రమ వలసల కారణంగా రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్ ద్వారా సంక్రమించిన ప్రత్యేక హక్కులు ఉల్లంఘనకు గురవు తున్నాయని, విశాఖ ఏజెన్సీ అరకులోయ, అనంతగిరి, లంబసింగి వంటి ప్రాంతాల్లో అభివృద్ధి ముసుగులో ప్రవేశ పెడుతున్న టూరిజం ప్రాజెక్టుల వల్ల ఆదివాసేతరుల అక్రమ వలసలు/ చొరబాట్లు పెరిగి స్థానిక ఆదిమజాతుల హక్కుల ఉల్లంఘన లేదా నిరాకరణ, 1/70 భూ బదలాయింపు నిషేధ చట్ట నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న భూపరాయికరణ జరుగుతుందని, ఆదివాసే తరుల అక్రమ కట్టడాలు, గుడారాల ముసుగులో వ్యభిచారం, మత్తు పదార్థాల వినియోగం వంటి అసాంఘిక కార్యకలాపాల వలన, హెచ్ఐవి/ఎయిడ్స్, డెంగీ, ఆరోన వంటి సరికొత్త వ్యాధుల సంక్రమణకు టూరిజం ద్వారా సంక్రమిస్తూ, దాని విస్తృతికి కారణమవుతుందని, అంతేకాకుండా పాశ్చాత్య సంస్క ృతులను బలవంతంగా ప్రవేశపెడుతూ, స్థానిక ఆదివాసీ తెగల సంస్క ృతి, సాంప్రదాయక విలువలపై దాడులు అధికమై తెగల గుర్తింపు సైతం కోల్పోవలసి వస్తుందని అన్నారు. విశాఖ ఏజెన్సీలో ఆదివాసీ చట్టాల అమలు, హక్కుల పరిరక్షణకై ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి సారథ్యంలో హక్కుల ఉల్లంఘనకు, గుడారాల (టూరిజం) ముసుగులో కొనసాగుతున్న వ్యభిచారం, భూ పరాయికరణలకు వ్యతిరేకంగా, కనీస అవసరాల సదుపాయాలు కల్పన కోసం ఆదివాసీలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్న సమయంలో కోట్లాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ అరుకు ఉత్సవాలు నిర్వహించడాన్ని ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి తీవ్రంగా వ్యరేతికస్తుందని, కావున ఈ నెల అనగా ఫిబ్రవరి 29, 2020 నుండి రెండు రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన అరుకు ఉత్సవాలను రద్దు చేసుకోవాలని కోరుతున్నట్లుగా తెలిపారు. బలవంతంగా ఉత్సవాలు నిర్వహిస్తే అడ్డుకుంటామని, అలాగే గత రెండు నెలలుగా ఏజన్సీ ప్రాంతంలో గిరిజనులు తమ హక్కులను, చట్టాలను కోల్పోతున్నామని, ఉద్యమం చేస్తూ తిరుగుబాటు చేస్తుంటే, అదివాసి ప్రాంతంలో ఉద్యమాలు జరగడం లేదని ఆదివాసీ ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నారని, ఆదివాసి జెఏసి ఇంత వరకు ఇచ్చిన వినతులను తీవ్రంగా పరిగణించి పరిష్కారించకుండా అరకు ఉత్సవాలు ఎట్లా నిర్వహిస్తారో చూస్తామని, మేం కూడా అంతే తీవ్రంగా ఉద్యమిస్తామని, ఏమైనా జరిగితే ఆదివాసీ ప్రజాప్రతినిధులు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ బాధ్యులవుతారని ఈ సందర్భంగా తీవ్రంగా హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ మొట్టడం రాజబాబు, అడపా పరమేశ్వరరావు, మద్దెల శివప్రసాద్ జగత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా తగ్గిన బంగారం

ముంబై : అయిదు రోజులుగా వరుసగా పెరుగుతున్న బంగారం జోష్‌కు మంగళవారం బ్రేక్ పడింది. గ్లోబల్ మార్కెట్లలో గోల్డ్ ధరలు పడిపోవడంతో పాటు మదుపుదారులు లాభాల స్వీకరణకు దిగడంతో బంగారం ధరలు ఎంసీఎక్స్‌లో ఒక్కరోజే ఏకంగా రూ. 1200 దిగివచ్చి రూ 42,855 పలికాయి. మరోవైపు గత ఐదురోజుల్లో పదిగ్రాముల బంగారం ఏకంగా రూ. 3000 పెరగడం గమనార్హం. పైపైకి ఎగిసిన పసిడి ధరలు ఒక్కసారిగా తగ్గడంతో వెండి ధరలు సైతం దిగివచ్చాయి. ఎంసీఎక్స్‌లో కిలో వెండి రూ. 1495 తగ్గి రూ. 47,910కి చేరింది. డాలర్‌తో రూపాయి మారకం పుంజుకోవడం కూడా హాట్ మెటల్స్ ధరలు దిగివచ్చేందుకు కారణమని బులియన్ నిపుణులు పేర్కొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి ప్రభావం రానున్న రోజుల్లో బంగారం ధరలను నిర్దేశిస్తుందని వారు చెబుతున్నారు.


## డాక్టర్లకు చెమటలు పట్టిస్తున్న ఐటీ దాడులు

విజయవాడ: ఐటీ అధికారులు విజయవాడలో మెరుపు దాడులు చేశారు. ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చూపుతున్న డాక్టర్లకు ఐటీ అధికారులు చెమటలు పట్టించారు. అధికారుల దాడులతో ఒక్కసారిగా కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, డాక్టర్లు ఉలిక్కిపడ్డారు. ఆదాయపన్ను శాఖకు పన్ను చెల్లించకుండా ఎగవేస్తున్న కార్పొరేట్ ఆసుపత్రులపై ఐటీ అధికారులు నిఘా పెట్టారు. విజయవాడలోని విజయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆకస్మిక దాడులు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించిన అన్ని ఫైల్స్‌ను ఐటీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఐటి రిటర్న్ దాఖలు చేసే విషయంలో కోట్ల రూపాయల్లో ఆదాయం ఉన్నప్పటికీ పన్ను చెల్లించే సమయానికి తక్కువగా చూపుతున్నట్లు ఐటీ అధికారులు పరిశీలనలో వెల్లడైనట్టు తెలుస్తోంది.

# రాజసం ఉట్టిపడే రాతి నిర్మాణాలు

## సంకీర్తన



త్రికుటేశ్వరాలయం

సూర్యాపేటకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పిల్లలమర్రిలో కాకతీయుల కాలంలో జీవం పోసుకున్న దేవాలయాలు, శిల్పకళా సంపద.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి. బౌద్ధ మతానికి సంబంధించిన ప్రతిమలను, జీవిత ఘట్టాలను, జ్ఞానోదయ చిత్రాలతోపాటు శాంతి చిహ్నాలు తదితర సన్నివేశాలు, ఆరామ కుడ్యాలపై ఎంతో అద్భుతంగా చెక్కబడ్డాయి. బౌద్ధ శిల్పకళలో సహజ సుందర దృశ్యాలకు, పశు పక్షాదులకు కూడా స్థానం లభించింది. అయితే మత ప్రచారానికి తోడ్పడే విధంగా అది రూపాంతరం చెందింది. ఉత్తర దక్షిణ శిల్పకళా సంస్కృతుల సమ్మేళనంతో కొత్త తరహా శిల్పకళను ఇక్కడ ప్రవేశపెట్టిన ఘనత కాకతీయులకే దక్కింది. క్రీ.శ.1000 నుంచి 1324 వరకు కాకతీయరాజులు ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. ఇదే కాలంలో వారి సామంతులుగా, మాండలికులుగా నల్లగొండను పాలించిన రేచర్ల వంశస్థులు ఈ తరహా శిల్పాలను ఆదరించారు. వీటిలో భాగంగానే పిల్లలమర్రి, పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామాల్లో నిర్మించిన దేవాలయాలు శిల్పుల మేధాశక్తి, కళలకు ప్రతీకలుగా చెప్పవచ్చు. ఒకవైపు కాకతీయ సామ్రాజ్య సంరక్షణకు యుద్ధాలు చేస్తూనే మరోవైపు శిల్పకళను ప్రోత్సహించడం వారి బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. ఆనాటి శిలలపై నగ్న దృశ్యాలు, సౌందర్య కుసుమాలు తదితర దర్పణంలాంటి చెక్కడాలు కళ్లను మైమరిపిస్తాయి.

**త్రికుటేశ్వరాలయం**

పిల్లలమర్రి గ్రామం ఉన్న త్రికుటేశ్వరాలయాన్ని కాకతీయుల రాజు అయిన రేచర్ల నామిరెడ్డి క్రీ.శ.1202లో నిర్మించారు. దుందుభి నామ సంవత్సరం చైత్రశుద్ధ ఏకాదశి శనివారం నాడు రాజు తన పేర నామేశ్వరలింగం ప్రతిష్ఠించి పూజాధికారులకు, దూపదీప నైవేద్యాలకు భూదానం ఇచ్చారు. ఈ విషయం వివరిస్తూ అక్కడ శాసనం కూడా రాయించారు. అదే ఆలయంలో మూడు శివాలయాలు ఏర్పాటు చేశారు. నామిరెడ్డి పేరు మీద నామేశ్వరాలయం మొదటిది కాగా, రాజు తన తల్లి పేరు మీద కాచేశ్వర, తండ్రి పేరున కామేశ్వర లింగాలను దేవాలయంలో ప్రతిష్ఠించాడని శాసనంలో ఉంది.

**దేవాలయాలతోపాటు పెద్దచెరువు**

పిల్లలమర్రిలో శిల్పకళా సంపద ఉట్టిపడే దేవాలయాలే కాదు.. త్రికుటేశ్వరాలయానికి అతి సమీపంలో పెద్ద చెరువు కూడా ఉంది. మూసీ నదిలో నీళ్లున్నంత కాలం ఆ చెరువులో జలకళ ఉట్టిపడుతుంది. **800 ఏళ్ల నాటి బావి**

ఎరుకేశ్వరాలయ ఆవరణలో 800 సంవత్సరాల క్రితం బేతిరెడ్డి భార్య ఎరుకసాని తాగునీటి కోసం తవ్వించిన బావి ఇప్పటికీ ఉంది. ఎంతటి వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు వచ్చినా ఆ బావిలో నీరు ఇంకిపోలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

**త్రికుటాలయంలో ఆసక్తికరమైన నంది**

త్రికుటేశ్వరాలయంలో శివలింగాలను కాపాడేందుకు రేచర్ల నామిరెడ్డి నంది విగ్రహాన్ని చేశారు. ఆ నంది మూడు శివలింగాలను కాపాడుతున్నట్లు అనిపిస్తుంది. మూడింటిలో ఏ శివలింగం ముందు నిలబడి చూసినా నంది దాని వైపే చూస్తున్నట్లుగా కనిపిస్తుంది. అక్కడకు వచ్చే భక్తులు మూడు లింగాలను దర్శించుకొని వెళ్తుంటారు.



త్రికుటాలయంలో ప్రత్యేక నంది విగ్రహం

## నాతవరం ఇన్‌ఛార్జ్ తహాశీల్దార్‌గా వివి.రమణ



నాతవరం : నాతవరం ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా వివి .రమణ నియమితులయ్యారు. ఇక్కడ తహశీల్దార్‌గా పని చేస్తున్న జె.శ్రీనివాస్ సెలవుపై వెళ్లడంతో ఆయన స్ధానంలో నక్కపల్లి మండల తహశీల్దార్‌గా పని చేస్తున్న వివి.రమణకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రమణ మాట్లాడుతూ ఉగాది నాటికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ఆయా భూముల్లో లేఅవుట్ల పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు.

## విగ్రహం పున:నిర్మాణం

నర్సీపట్నం : నర్సీపట్నం అబీద్‌సెంటర్ కూడలిలో డివైడర్‌పై రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఢీకొనడంతో విరిగిపోయింది. పోలీసుల ఆధ్వర్యంలో లారీ యాజమాని దీనిని పున:నిర్మిస్తున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన లారీ అబీద్‌సెంటర్ వెనుకకు మళ్లిస్తున్న సమయంలో విగ్రహాన్ని ఢీకొందని పోలీసులు తెలిపారు. ఈ లారీని స్టేషన్‌కు తరలించారు.

## పట్టుబడ్డ ఇసుక బండ్లు

కోటవురట్ల : అక్రమంగా తరలిస్తున్న ఇసుకను రవాణా చేస్తే ఉపేహించేది లేదని స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు. మంగళవారం ఉదయం రాజుపేట వరహానది నుండి అక్రమంగా టైరుబళ్లపై తరలిస్తున్న ఇసుకను పట్టుకున్నామని కోటవురట్ల ఎస్సై సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుకను తరలించరాదని అన్నారు. పట్టుబడ్డ బండ్లను తహశీల్దార్ ఆదేశాలతో చర్యలు తీసుకుంటామన్నారు.

## ఏప్రిల్ 3 నుంచి 5 వరకు మెడికల్ ఎక్విప్‌మెంట్ ఎక్స్‌పో


తిరుపతి : భారతదేశపు అతిపెద్ద బీ2బీ మెడికల్ ఎక్విప్మెంట్ ఎక్స్‌పోను మెడికాల్‌ను మెడిఎక్స్‌పర్ట్ బిజినెస్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో నిర్వహించనున్నట్లు కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ మణివన్నన్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికాల్ అనేది నిజంగా ఒక ఆసుపత్రికి కావాల్సిన సూపర్ మార్కెట్ అని పేర్కొన్నారు. డిస్పోజబుల్స్ నుంచి అంబులెన్స్ వరకు అన్నీ ఒకే పైకప్పు కింద దొరుకుతాయని తెలిపారు. మెడికాల్ అనేది వైద్యులు, హాస్పిటల్ యజమానులలో అత్యంత ప్రాచుర్యం పొందిన ప్రదర్శన అన్నారు. ఈ ట్రేడ్ ఫెయిర్లో శస్త్రచికిత్సకు ఉపయోగించే కాటన్ నుంచి సరికొత్త వైద్య పరికరాల వరకు అన్నీ లభిస్తాయన్నారు. ఆరు వేలకు పైబడు ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

## ట్రేడ్ లైసెన్స్ చెల్లించని షాపులు సీజ్



అనకాపల్లి : జీవిఎంసీ పరిధిలోగల వ్యాపారులంతా తక్షణమే ట్రేడ్ లైసెన్స్ చెల్లించాలని లేని పక్షంలో షాపులను సీజ్ చేయడం జరుగుతుందని జీవిఎంసీ జోనల్ కమీషనర్ శ్రీరామమూర్తి అన్నారు. పట్టణంలో గల వ్యాపారుల వద్దకు కమీషనర్ శ్రీరామమూర్తి సిబ్బందితో కలిసి వెళ్లి ట్రేడ్ లైసెన్స్ చెల్లించి జీవిఎంసీకి సహకరించాలని కోరారు. ఈ సందర్బంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఇప్పటికీ 25 లక్షలు కట్టవలసి ఉందని, మంగళవారం ప్రత్యేక డ్రైవ్‌లో 3 లక్షల రూపాయలు కట్టించామని అన్నారు. మిగిలిన 22 లక్షలు ఈనెల 29 తారీఖు లోగా వ్యాపారులంతా చెల్లించాలన్నారు. గడువులోగ చెల్లించని వారిపై మార్చి 1 తేదీ నుంచి 25 శాతం అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందని ఏప్రిల్ 1 నుంచి 50 శాతం అపరాధ రుసుము కట్టవలసి ఉంటుందన్నారు. కట్టలేని షాపులను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సేనిటరి ఇన్స్‌పెక్టర్ పళ్లా శ్రీనివాస్‌రావు, జీవిఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 26వ వార్డులో విద్యాదీవెన కార్డులు పంపిణీ



అనకాపల్లి : పట్టణంలో గవరపాలెం 26 వవార్డులో ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన సంక్షేమ కార్యక్రమాల కార్డుల పంపిణీ జరిగింది. వార్డు ఇన్‌చార్జ్ కోరిబిల్లి ఆరుద్ర గ్రామ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఈ కార్డులను పంపిణీ చేశారు. విద్యాదీవెన ఆరోగ్యశ్రీ, లబ్ధిదారులకు వీటిని అందజేసారు. ఈ కార్యక్రమంలో సచివాల సిబ్బంది వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యాదీవెన కార్డులు పంపిణీ

నాతవరం : నాతవరం మండలం గన్నవరం సచివాలయంలో జగనన్న విద్యాదీవెన కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమం చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన చెప్పారు. అలాగే ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా గ్రామ సచివాలయంలో సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హుస్సేన్, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



విద్యాదీవెన కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఆదిరెడ్డిపాలెంలో గ్రామ వాలంటరీలకు సెల్‌ఫోన్లు, విద్యార్థులకు విద్యా దీవెన కార్డులను పంపిణీ చేసిన జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము



సబ్బవరం : మండలంలోని ఆదిరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం గ్రామ వాలంటీర్లకు సెల్ ఫోన్లు, విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా దీవెన కార్డులు పంపిణీ చేసిన విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కోటాన రాము చేతుల మీదుగా సచివాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామ వాలంటీర్లు ఎటు వంటి అవినీతికి తావు లేకుండా పని చేయాలని సూచించారు. విద్యార్థులు విద్యలో ప్రగతి సాధించాలన్నారు.

ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మేరకు నెరవేర్చారు అన్నారు ఈ కార్యక్రమంలో కోటాన కోటయ్య, కోటాన కృష్ణ, బయలు పూడి దేముడుబాబు, పల్ల కృష్ణ సచి వాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## దివీస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

భీమునిపట్నం : భీమిలి మండలం చిప్పాడ గ్రామంలో ఉన్న దివిస్ ఆధ్వర్యంలో చిప్పాడ లో ఉచిత కంటి వైద్య సేవలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని దివి స్ జనరల్ మేనేజర్ ఎల్.వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ నిర్వహించింది .ఈ శిబిరాన్ని దివి సంస్థ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.రావు ప్రారంభించారు. వైద్యపరీక్షలు అభినిత్ జైన్, బి రజత, దనుంజయ, జయక ృష్ణ లు 160 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దీనికి తూడెం అన్నవరం, చిప్పాడ, పెద నాగమయ్యపాలెం, మూలకుద్దు, గుడివాడ, టి.నగరపాలెం పంచాయతీలనుంచి వైద్య శిబిరంకు వచ్చారు. ఈ కార్యక్రమం లో దివీస్ సిబ్బంది ఈఎస్. నాగరాజు, టి.వెంకటేశ్వరులు, కె.నరసింహ రావులు పాల్గొన్నారు.



## ఘనంగా పరవాడ పరదేశిమాంబ పండుగ



పరవాడ : మండల కేంద్రమైన పరవాడలో గల పరదేశీమాంబ పండుగ మంళవారము అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజామునుండే ప్రజలందరూ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైసీపీ సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు, మాజీ సర్పంచ్ చుక్కరామునాయుడు, వైసీపీ మండల పార్టీ ప్రెసిడెంట్ సిరపురపు అప్పలనాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పైల సన్యాశిరావు మాస్టర్, రెడ్డి శ్రీనువాసురావు, పైల రామచంద్రరావు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరము మధ్యాహ్నం భారీ అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. ఈ అన్నసమారాధనలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరము సాయంత్రము ఏర్పాటు చేయబడిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రెడ్డిఎర్నియుడు, పైల నరేష్, చుక్క సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుడ్ని దర్శించిన తుని మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి తొలిపావాంచ వద్ద తుని మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమితులైన కొయ్యా.మురళీకృష్ణ కొబ్బరికాయలు కొట్టి సత్యదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల తుని మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమింపబడి ప్రమాణస్వీకారానికి వెళుతూ మార్గ మధ్యంలో తన అనుచరులుతో కలసి సత్యదేముని మెట్ల మార్గం వద్ద ఆగారు.ఆయనకు స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, దడాల సతీష్, బొబ్బిలి వెంకన్న, కొల్లు చిన్నా, గొర్ల బుజ్జి, తాటిపాక శ్రీను తదితరులు పూలమాలలు వేసి స్వాగతం పలికారు.దర్శనం అనంతరం ఆయనకు శాలువా కప్పి, స్వామి వారి చిత్ర పటము, ప్రసాదం ఇచ్చి సత్కరించారు.ఆయన వెంట తాడిపర్తి బాబురావు, సత్యన్నారాయణ తదితరులు ఉన్నారు.



## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రమాదంలో ఒకరు మృతి - మరొకరికి స్వల్ప గాయాలు

అన్నవరం/తొండంగి : తూ.గో.జిల్లా అన్నవరం జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోరమైన రోడ్డు ప్రమాదంలో కడియపులంక వాసి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లగా మంగళవారం అర్ధరాత్రి గం. 1.30ని.ల ప్రాంతంలో కడియపులంక కు చెందిన అయ్యప్ప, సత్యనారాయణ అనబడే ఇరువురు వ్యక్తులు కడియపులంక నుండి అన్నవరం దైవ దర్శనమునకు బైక్ పై బయలుదేరు. జాతీయరహదరి బెండపూడి-పోలవరం కెనాల్ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం డీ కొట్టగా సత్యనారాయణ (30 సంవత్సరములు) అక్కడికక్కడే మృతి చెందగా మరొక వ్యక్తి అయ్యప్ప స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.వీరిరువురు ఒకే నర్సరీలో పని చేస్తున్నారని అయ్యప్ప తెలిపారు. వాహనం ఏది ఢీ కొట్టినది అన్నది తెలియలేదు. సంఘటన జరిగిన ఘటనా స్ధలానికి స్ధానిక తొండంగి పోలీసులు అక్కడకు చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.





జోన్-3 'జోనల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వార్డు ప్రకటనలో తడి-చెత్త, పొడి చెత్త సేకరణని ఆర్‌టిఎంఎస్ మైక్రో పోక్లరెట్ స్కానింగ్ జరుగుతుంది. 19వవార్డులో రామ్‌నగర్, నెహ్రూనగర్, ఫికల్ లే అవుట్, ఉమామహేశ్వరి గార్డెన్స్, సిరిపురం, పితానిదిబ్బ, భానోజీనగర్, సంతోషిమాత కాలనీ, నౌరోజి రోడ్డు, దసపల్లా హిల్స్, ఊడిగడ్డలో గల ఇంటింటికి వెళ్ళి మైక్రో పోక్లరెట్స్ అంటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, శానిటరీ మేస్త్రీ అప్పలరాజు, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దారమల్లేశ్వరుని హుండి ఆదాయం రూ 2.19 లక్షలు

గొలుగొండ : మండలంలో శివరాత్రి ఉత్సవాలకు మల్లేశ్వరి హుండీ ఆదాయం రూ.2.19 లక్షల వచ్చినట్లుగా ఎండోమెంట్ అధికారులు దృవీకరించారు. మూడు రోజులు జరిగిన ఉత్సవాలలో భక్తుల నుండి హుండీల ద్వారా రూ.62 వేలు, స్వామివారి దర్శనం టిక్కెట్ల ద్వారా ఒక లక్ష ఇరవై ఒక్క వేలు, తలనీలాలు సైకిల్ స్టాండ్ ద్వారా రు36 వేలు కలిపి మొత్తం రూ.2.19లక్షల రూపాయలు వచ్చింది. మూడు రోజుల తర్వాత కుందేలును గొలుగొండ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. కుండీలలో మంగళవారం ఉదయం పది గంటల సమయంలో మల్లేశ్వరి సన్నిధిలో ఎండోమెంట్ అధికారులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కింపు చేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వసంత, ఇఒ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ వాడపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏవిఎన్ కళాశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమము



విశాఖపట్నం : భారతదేశ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ మరియు బ్రాడ్ కాస్టింగ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మిస్సెస్ ఏవిఎన్ కళాశాలలో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమం కళాశాల ఆవరణలో జరిగినది. ఈ కార్యక్రమానికి పంజాబ్ రాష్టం నుంచి 15 మంది, యూత్ అఫైర్స్ నుంచి ఐదు మంది ఏవి ఎన్ కళాశాల నుండి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పంజాబ్ రాష్టం నుంచి జగదీష్ సింగ్ ఆధ్వర్యంలో 15 మంది కళాకారులు పంజాబ్ రాష్ట్రం యొక్క సంస్కృతిని తెలియజేసే వివిధ కార్య క్రమాల్ని ప్రదర్శించారు. వీటిలో ముఖ్యమైంది బంగ్రా డ్యాన్స్. యూత్ ఎఫైర్స్ నుంచి వచ్చిన ఐదుగురు కళాకారులు బుర్రకథలు ప్రదర్శించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ యొక్క గొప్పతనము సంస్కృతిని తెలియజేశారు. కళాశాల విద్యార్థులు, మరియు వారి బృందం సభ్యులు దిమ్స డాన్స్ ని అపర్ణ , ప్రసాద్ మరియు వారి బృందం సభ్యులు, పంజాబీ డాన్స్, లావణ్య అనే విద్యార్థి ఆంధ్రప్రదేశ్ సంబంధించి జానపద గీతాన్ని ఆలపించింది. ఈ కార్యక్రమం విశాఖపట్నం యూత్ ఎఫైర్ కోఆర్డినేటర్ గోపాలకృష్ణ పర్యవేక్షణలో జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.వి జయప్రకాష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రియతమ ప్రధాన మంత్రి, నరేంద్రమోడీ పిలుపుమేరకు పంజాబ్ రాష్టం తో మన సంస్కృతి సాంప్రదాయాలను పరస్పరము తెలియజేసే కార్యక్రమము ఇదీ అని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి యన్ కృష్ణవేణి నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్పోకెన్ హిందీ ట్రైనర్ శ్రీమతి భానుమతి, ఐ టి ఎస్ సి కో ఆర్డినేటర్ ఆచార్య ఎస్ శ్రీనివాస్, ప్లేస్మెంట్ అధికారి కెప్టెన్ డాక్టర్ ఎన్.రామకృష్ణ, డాక్టర్ సి మమత మొదలగు వారు పాల్గొన్నారు.

# 15,31,44 వార్డులలో ప్రజాదర్బార్ కార్యక్రమం



విశాఖపట్నం : విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతీ మంగళవారం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయబడుతున్న ప్రజాదర్బార్ ప్రోగ్రామ్ 15, 31, 44వవార్డులకు సంబంధించిన ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆకాంక్షతో ఏదైనా అత్యవసర సమస్య ఎదురైతే తక్షణమే సమస్యల వద్దకు వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను క్లియర్ చేస్తున్నారు. మంగళవారం 31వ వార్డ్ టీడీపీ సీనియర్ నాయకుడు ఏం.ఎల్.ఎన్.రావు వారి అమ్మకి కింగ్ జార్జ్ హాస్పిటల్ లో మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్ సూపరెంట్‌తో మాట్లాడటం జరిగింది. ప్రధానంగా చాలామందికి పెన్షన్లు తీసివేయటం పై ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయం పై సంబంధించిన అధికారులతో మాట్లాడి పునః పరిశీనల చేయాలని కొత్త ఫార్మాట్ లో కోరడం జరిగింది. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్స్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంనకు 15వవార్డ్ ప్రెసిడెంట్ అల్లూరి సత్యనారాయణ రెడ్డి, 31వవార్డ్ ప్రెసిడెంట్ నున్న నాగేంద్ర, 44వార్డ్ ప్రెసిడెంట్ చిన్ని కుమార్, 27వార్డ్ ప్రెసిడెంట్ బాపు ఆనంద్, రమణారావు, రామానంద్, కొల్లి రమేష్, రమేష్, సారిపల్లి మహేష్, జాఫరుల్లాహ్, చింతకాయల వాసు, పైడిరాజు, రాం కిషోర్, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 160 మంది నిరుపేదలకు ఆహార పొట్లాలు పంపిణీ



సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ సురగిరి మాదవ్ ముఖర్జీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వారు కుటుంబ సభ్యులు సమకూర్చిన ఆహార పొట్లాలను మంగళవారం నిరుపేదలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఏ ఎస్ ఐ పి కృష్ణమూర్తి పాల్గొని ఆయన చేతుల మీదుగా ప్రారంభం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ సమాజహితం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు సహాయం చేయాలని కోరారు మదర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వి సత్యగంగరాజు మాట్లాడుతూ బెస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను సబ్బవరం నుంచి వయా పెందుర్తి, వేపగుంట గోపాలపట్నం, ఎన్ఏడి కొత్త రోడ్ వరకు రోడ్డు పక్కన ఉన్న యాచకులకు నిరుపేదలకు 160 మందికి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ, ఏఐ చైతన్య, రమేష్, శ్యామల, తారకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్లకు సెల్‌ఫోన్లు పంపిణీ



గొలుగొండ : మంగళవారం గ్రామ వాలంటీర్లకు పంచాయతీ కార్యదర్శులు అందరూ సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. గ్రామ వాలంటీర్లు అంతా పెన్షనర్ల ఇంటికి వెళ్లి పింఛన్లు అందించాలనే లక్ష్యంతో ప్రతి వాలంటీర్లకు ప్రభుత్వం సెల్‌ఫోన్లను కేటాయించింది. దీనిలో భాగంగా గత నెలలో మండలానికి 40 సెల్‌ఫోన్‌లు రాగా ఒక్కొక్క పంచాయతీకి ఇద్దరు వాలంటీర్ల చొప్పున ఈ ఫోన్లు అందచేశారు. సోమవారం మండలంలో మిగిలిన 281 మంది వాలంటీర్లకు మండల పరిషత్ పరిషత్ కార్యాలయానికి సెల్‌ఫోన్లు వచ్చాయి. వాటిని మంగళవారం సచివాలయాల్లో గ్రామ వాలంటీర్లకు ఆయా పంచాయతీ కార్యదర్శులు అంతా అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో...

చీడిగుమ్మల పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, వైసిపి నాయకులు, పంచా యతీ కార్యదర్శులు గౌరీ, రమణమ్మ, సత్యనారాయణ, అప్పారావు, రమణ, ప్రకాష్, నాగేంద్రకుమార్, శ్రీను, కిరణ్మయి, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు. .

## వచ్చే నెల 9,10,11 తేదీలలో

# 94వ శ్రీ సనాతన జ్ఞాన సభలు



భీమునిపట్నం : 94వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు మార్చి నెల 9,10,11 తేదీలలో తగరపువలస పుట్ బాల్ గ్రౌండ్ లో నిర్వహించనున్నట్లు అసంగా నందగిరి స్వామి చెప్పారు. స్థానిక పాత స్టేట్ బ్యాంక్ లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో శ్రీ వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు పూజ్య శ్రీశ్రీశ్రీ పరిపూర్ణా నందగిరి స్వాములు వచ్చి సనాతన వేదాంతంను బోధించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో 150మంది స్వాములు, మాతలు పాల్గొంటారని, దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియజేస్తామని,

ఈ కార్యక్రమంలో మంత్రులు, అధికారులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మైలపల్లి షణ్ముఖరావు, మణికంఠ స్వీట్ షాప్ యజమాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో వైయస్సార్ పొలంబడి కార్యక్రమం



కాట్రేనికోన : కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముందుగా పోలంపరిశీల తరువాత రైతులతో సమావేశమై, పొలంలో చూసిన వాటిపై చర్చ జరిగినది. వరిపొలం లో కొన్ని చోట్ల మాగుడు తెగులు , ఆకు ఎండు తెగులు గమనించాము. నివారణ చర్యలు. హెక్సకోనజోల్ 5జుజ 2ఎశ్రీ/1లీటర్ నీటికి ఎకరానికి 400ఎశ్రీ/1ఖుఎ కి పిచికారీ చేయాలి. అలాగే ఆకు ఎండు తెగులు కు నివారణకు నత్రజని ఎరువులు (చీ) తగించాలి,పొలాలను క్లీన్ గా ఉంచాలి. దేశవాళీ ఆవు మూత్రం 10లీ/100లీ వాటర్, ఎకరానికి కలుపుకొని పొలంపై పిచికారీ చేయాలి, ప్రస్తుతం ఈ తెగులు నివారణకు మందులు లేవు. ప్లాంటమైసిన్ శితీ బాక్ట్రీమైసిన్ వంటి మందులను హెక్సఏశీఅజోల్ మందులతో కలిపి పిచికారీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో శ్యాం కుమార్, భవాని, రాజేష్, రైతులు పాల్గొన్నారు. కె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మెగా ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన

గొలుగొండ : వైయస్సార్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలో ఏఎల్‌పురం సంత ఆవరణలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన సెవెన్ హిల్స్ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో గుండె మూత్రపిండాలు ఎముకలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, అలాగే గ్రహణం మొర్రి, ప్లాస్టిక్ సర్జరీ అవసరమైన రోగులకు ఉచితంగా చేస్తారని ట్రస్టు సభ్యులు తెలిపారు. సుమారు 150 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ ఆదిత్య తెలిపారు. అనంతరం మందులు ఉచితంగా అందజేశారు.

## విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

### మాజీ ఎమ్మెల్సీ డివి.సూర్యనారాయణరాజు

కోటవురట్ల : విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వైసిపి రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ డివి.సూర్య నారాయణరాజు అన్నారు. కైలాసపట్నం గ్రామంలో జగనన్న విద్యాదీవెన లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



విద్యాదీవెన కార్డులు అందజేస్తున్న దృశ్యం

# జగన్ అన్న విద్యాదీవెన పేదప్రజలు పాలిట వరం



పరవాడ : పరవాడ మండలం వాడచీపురిపల్లి పంచాయతీ దాలయిపాలెం క్యాంప్ ఆఫీస్ లో మంగళవారము జగనన్న వసతి విద్యాదీవెన కార్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అధీప్‌రాజ్ హాజరై ఆయన చేతులు మీదగా పంపిణీ చేశారు. అనంతరము ఆయన మాట్లాడుతూ జగన్ అన్న వసతి, విద్యాదీవెన కార్డులు పేదప్రజలు పాలిట గొప్పవరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, ఎఫ్‌సిఐ మెంబర్ మెంబెర్ పిఎస్.రాజు, వాడచీపురుపల్లి వైసీపీ కన్వీనర్లు బురద రాజు, బూస అప్పలరాజు, కుంద్రాపు తాతాజీ, బండి ముత్యాలు, వెన్నెల సన్యాసిరావు, కుంద్రాపు సీతారామయ్య, తిక్కడ సత్యనారాయణ పాల్గొన్నారు.

# 3న తవ్వవానిపాలెంలో శ్రీ పరదేశమ్మ పండగ మహోత్సవం

## జిల్లాస్థాయి షటిల్ బ్యాట్మెంటన్, ముగ్గులు, చిరతలు, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించబడును



సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం పాలెం గ్రామంలో మార్చి 3వ తేదీన శ్రీ పరదేశమ్మ పండగ అనుపు మహోత్సవం జరుగును మంగళవారం విలేకరుల సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, వైసిపి నాయకులు బోకం శ్రీనివాస్ ,మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు ,బోకం కాసుబాబు తెలిపారు. ఈ పండగ 24వ తేదీ నుండి మార్చి 3వ తేదీ వరకు 9 రోజులు జరుగునని ,మార్చి 3వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల నుండి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించబడును అని సాయంత్రం భారీ మందుగుండు సామాగ్రి తో వైభవంగా పండగ మహోత్సవం నిర్వహించబడును అని తెలిపారు .ఈ పండగ సందర్భంగా ఈ నెల 27 , 28 వ తేదీ న జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగునని ఈ పోటీలను ముఖ్యఅతిథిగా మాజీ ఆర్ఇసిఎస్ డైరెక్టర్ సబ్బవరపు నారాయణమూర్తి పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి 15000 ద్వితీయ 10000 తృతీయ 8000 నాలుగో 6000 రూపాయలు ఇవ్వబడిన అని తెలిపారు. 29వ తేదీన రాత్రి 7 గంటల నుండి జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు జరుగునని ఈ పోటీలను మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు ప్రారంభిస్తారని గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి 6000 ద్వితీయ 4000 తృతీయ 3000 నాలుగో 2000 రూపాయలు ఇవ్వబడినని తెలిపారు ఈ పోటీల్లో పాల్గొన్న మహిళలు ముగ్గుపిండి కలర్స్ తీసుకొని రావాలని తెలిపారు. మార్చి 1వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు నుండి జిల్లా స్థాయి చిరుతల పోటీలు నిర్వహించబడునని ఈ పోటీలను వైసిపి నాయకులు చొక్కాకుల వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు

ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి 15000 ద్వితీయ 10000 తృతీయ 10000 నాలుగో 8000 5వ 6000 రూపాయిలు నగదు బహుమతి ఇవ్వబడును అని తెలిపారు ఈ పోటీల్లో ఓటమి చెందిన వారికి ట్రావెలింగ్ చార్జీలు కింద వెయ్యి రూపాయలు ఇవ్వబడును అని తెలియజేశారు . 2వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించబడును ఈ పోటీలను మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు ప్రారంభిస్తారని తెలిపారు గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి 12000 ద్వితీయ 10000 తృతీయ 8000 నాలుగో 6000 రూపాయలు నగదు బహుమతి ఇవ్వబడును అని తెలిపారు మూడో తేదీ మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుండి జిల్లా స్థాయి గుర్రపు పోటీలు నిర్వహించబడును అని తెలిపారు. ఈ పోటీలను పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారం భిస్తారని తెలిపారు అదే రోజు రాత్రి ఏడు గంటలకు మందుగుండు పోటీలు నిర్వహించ బడును ప్రథమ బహుమతి 20 వేలు ద్వితీయ బహుమతి 10 వేలు రూపాయలు నగదు బహుమతి ఇవ్వబడును అని తెలిపారు అదే రోజు రాత్రి 9 గంటలకు ఎమ్మెల్యే ఈవెంట్స్ వారిచే సంస్కృత కార్యక్రమం నిర్వహించబడును అని తెలిపారు.

ఈ సంస్కృతి కార్యక్రమాలకు సినీ తారలు హైదరాబాద్ నుంచి పాయల్ రాజ్ పుత్ హీరోయిన్ , యాంకర్ భానుశ్రీ, డీ జోడి బిగ్ బాస్ -2, సింగర్ మధుప్రియ ,హైపర్ ఆది జబర్దస్త్ ,ఐశ్వర్య డి ఛాంపియన్స్, ప్రియాంక డీ జోడి విన్నర్ ,మయూరి డీ జోడి ,మానసి డీ ఛాంపియన్ ,దర్శిని ఢీ-10 ,హైపర్ ఆది అండ్ రైజింగ్ రాజు టీం పాల్గొంటారని తెలిపారు ఈ పండగ మహోత్సవానికి ప్రముఖ పారిశ్రామికవేత్త బోక శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో జరుగునని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో డెక్కా పవన్, రెడ్డి ప్రసాద్, బోకర్ శ్రీను, లోకేష్, జి.భార్గవ్‌కుమార్, మిడితాడ బాలు, డెక్కా బాలు, భోకం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కోటవురట్ల : కోటవురట్ల మండలంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశుద్య కార్మికులు మాట్లాడుతూ 18 నెలల వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం బకాయిలతో సహా వేతనాలు చెల్లించి ఆదుకోవాలని వారు అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు వెంకటస్వామి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు రూ.18వేలు ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ పిఎఫ్, పింఛన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. 60 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతీ కార్మికుడికి రూ.6వేలు పింఛన్ మంజూరు చేయాలన్నారు. సమానమైన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రింకోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికు పిల్లలకు ఉచిత విద్య వైద్యం అందించాలన్నారు.

# కెడిపిఎం హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా కదిరి రాము



విశాఖపట్నం : చినవాల్తేరులో గల కెడిపిఎం మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా న్యాయవాది కదిరి రాము ఎన్నికయ్యారు. సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు 2020-21 జరిగిన నేపథ్యంలో గౌరవ అధ్యక్షునిగా ఎస్.రాజ గోపాల రావు, ఉపాధ్యక్షునిగా ఎన్. నాగయ్య, కార్యదర్శిగా ఎమ్ఎస్ఆర్ ప్రసాద రావు, సంయుక్త కార్యదర్శిగా పి.వి.ఆర్. మూర్తి, కోశాధికారిగా సిహెచ్. వెంకట రావు, సలహాదారులుగా బి.వేణు గోపాల రావు, జి.వి.కాశికుమార్, పివిఆర్‌కె. కుమార్, కార్యవర్గ సభ్యులుగా బి.రఘురామ్, సిహెచ్. రామా రావు రెడ్డి, ఎస్.పైడిరాజు, కె.ప్రసాద్, కె.గంగాధరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘంలో 1960 సంవత్సరం నుండి వివిధ బ్యాచ్‌లకు చెందిన 10వతరగతి విద్యార్థులు ఉండడం విశేషమని అన్నారు.

# సిబిఎమ్ కాంపౌండ్‌లోని ఏబిసి చర్చిలో దొంగతనానికి విఫలయత్నం

**విశాఖపట్నం నుండి క్లూస్ టీం వచ్చి ప్రత్యేకంగా వివరాలు సేకరణ**

**బాగా పరిసరాల పై అవగాహన ఉన్నవారే ఈ పనికి పాల్పడి ఉంటారని అనుమానం**



నర్సీపట్నం: స్థానిక సి బి ఎమ్ కాంపౌండ్ లోని ఏ బి సి చర్చ్ లో దొంగలు దొంగతనం చేయడానికి విఫలయత్నం చేశారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ సీసీ కెమెరా కు దొరకకుండా వెనుక ఉన్న తలుపు వైపు మంట పెట్టడం, కిటికీని బ్రద్దలకొట్టడం చేశారు. కిటికీలో నుండి యాంప్లిఫైయర్ తీయడానికి ప్రయత్నం జరిగింది .స్థానిక పట్టణ సీఐ స్వామి నాయుడు సంఘటన జరిగిన సోమవారం రాత్రి చర్చి వద్దకు వెళ్లి పరిసరాలను చూసి వచ్చారు. ఎవరూ వస్తువులను తాకరాదని ఆదేశాలు జారీ చేశారు.

బ్లూ కోటు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్లూస్ టీం వచ్చేవరకు వేచి చూశారు. మంగళవారం ఉదయం చర్చి సభ్యులు పట్టణ సీఐ కు ఫిర్యాదు ఇచ్చారు. కొన్ని గంటల వ్యవధిలోనే క్లూస్ టీం వచ్చి అక్కడ ఆధారాలను లభ్యమైన ఇతర వస్తువులను సేకరించారు .వివరాలను తగు సూచనలతో స్థానిక పోలీసులకు అందజేశారు. చర్చ్ పై బాగా అవగాహన ఉన్నవారు మాత్రమే పాల్పడి ఉండవచ్చునని, లేదా ఇన్స్ట్రుమెంట్స్ పై మోజు తో ఇలా చేసి ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల్లోనే దొంగను పట్టుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# పదోన్నతులపై " సుప్రీం "తీర్పు సమీక్షించాలి : దళిత నాయకులు డిమాండ్



కాకినాడ : ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులలో రిజర్వేషన్లపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు.ఈమేరకు పెదపూడి మండల దళిత నాయకులు మంగళవారం డిఆర్వో సత్తిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు గుంటు రాజశేఖర్ మాట్లాడుతూ సుప్రీం తీర్పు ఉద్యోగులలో ఆందోళన కలిగిస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు.ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో భద్రరావు,ఉల్లం వీరు, కె.శ్రీనివాసరావు, వై.రాజు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేద విద్యార్థికి విద్యను అందేంచడమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం

**ఐటీఐ విద్యార్థులకు ఏటా రూ.10 వేలు, పాలిటెక్నిక్ వారికి రూ.15 వేలు, డిగ్రీ, ఆపై కోర్సుల విద్యార్థులకు రూ.20 వేలు**

**హాస్టల్, మెస్ ఛార్జీల నిమిత్తం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ**

**వైసీపీ ఉత్తరనియోజకవర్గం సమన్వయ కర్త కేకేరాజు**

కంచరపాలెం: ప్రతి పేద విద్యార్థికి విద్యను అందేంచడమే లక్ష్యంగా పేదరికం వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరో నూతన విప్లవానికి నాంది పలికారని వైసీపీ ఉత్తరనియోజకవర్గం సమన్వయ కర్త కేకేరాజు పెర్కొన్నారు. ఈమేరకు అక్కయపాలెం షాదీఖాన వద్ద మంగళవారం ఉదయం ఉత్తర నియోజకవర్గానికి సంబంధించిన జగనన్న వసతి దీవెన లబ్ధి దారులకు కార్డులు మరియు కొత్త పెన్షన్లు,పాత పెన్షన్లు పునరుద్ధరణ చేసిన పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ ఇప్పటికే 'అమ్మఒడి' పథకం కింద 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, పీహెచ్ డీ విద్యార్థులకూచేయూత అందించేందుకు 'జగనన్న వసతి దీవెన' పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పెద్ద చదువులు చదివే పేద విద్యార్థులకు ఇప్పటికే చెల్లిస్తున్న పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ ను కొనసాగిస్తూనే.. భోజనం, వసతి సౌకర్యాల నిమిత్తం ఆర్థికసాయం అందించేలా 'జగనన్న వసతి దీవెన' పథకాన్నిఅమలు చేస్తున్నారు.






విద్యార్థులు చదివే కోర్సును బట్టిఏడాదికి రూ.10 వేల నుంచి రూ.20 వేల చొప్పున వారితల్లుల ఖాతాల్లో జమ చేసే ఇలాంటి పథకం దేశంలోనే మరెక్కడా లేదని అన్నారు. నాడు విపక్ష నేతగా రాష్ట్రమంతటా జరిపిన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసిన వైఎస్ జగన్ పేద ప్రజలకి భరోసా కల్పించేలా 'జగనన్న వసతి దీవెన' పథకానికి శ్రీకారం చుట్టారు. పేదరికంలో ఉన్న ఏఒక్క విద్యార్థి కూడా ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న సంకల్పంతో పథకాన్ని అమల్లోకి తీసుకురావడం జరిగిందని . 18 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు ఉండి, ఇంటర్ తర్వాత కళాశాలల్లో చేరుతున్న వారి 'గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో'కేవలం 23 శాతం ఉంటోంది. ఇలాంటి దారుణ పరిస్థితికి పేదరికమే కారణమవుతోందని గ్రహించి.. ఆ పరిస్థితిని మార్చాలన్న సంకల్పంతోనే సీఎం ఈ పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాల్గున్న జీవీఎంసీ జోన్ -4 కమిషనర్ పి.సింహచలం మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేయూతనిచ్చేవిధంగా ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సధ్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు కార్యక్రమంలో పాల్గున్న కెకె .రాజు , జీవీఎంసీ జోన్ -4 కమిషనర్ పి.సింహచలం వసతి దీవెన లబ్ధి దారులకు కార్డులు మరియు కొత్త పెన్షన్లు,పాత పెన్షన్లు పునరుద్ధరణ చేసిన పెంక్షన్ దారులకు పెంక్షన్లు పంపిణీ చేసారు . కార్యక్రమంలో వైసిపి పార్లమెంటరీ విభాగం అద్యక్షుడు బర్కత్ అలీ , మైనార్టీ నాయకుడు షేక్ .బాబ్జి , బాణాలశ్రీను, దుప్పలపూడి శ్రీనివాసరావు,షేక్ జుబేర్, సేనాపతి అప్పరావు, సబ్బం ఆఫ్రోజ్ జీవీఎంసీ జోన్ -4 సిబ్బంది పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గున్నారు.

# గాజువాక బార్ అండ్ రెస్టారెంట్లపై ఎక్సైజ్ అధికారులు దాడులు

**-అక్రమాలను గుర్తించి బార్లను సీజ్ చేసిన అధికారులు**

**-105 మద్యం సీసాలు స్వాధీనం**



గాజువాక: నియోజకవర్గం పరిధిలోని పలు బార్లపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి సేకరించిన మద్యం బాటిళ్ళను బార్లలో విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ దాడులను మంగళవారం నిర్వహించారు. గాజువాక, దువ్వాడ, కూర్మన్నపాలెం ప్రాంతాలలోని కళ్యాణి, వీరాంజనేయ, రామకృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ ప్రభుత్వం మద్యం దుకాణం ద్వారా తక్కువ ధరకు అమ్ముతున్న మద్యం బాటిళ్ళను అక్రమంగా తీసుకొచ్చి బార్లలలో అమ్మతున్నట్లు గుర్తించారు. దీంతో మూడు బార్స్ సీజ్ చేసారు. ఇందుకు సంబందించిన ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం......ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా తక్కుధరకు అమ్ముతున్న మద్యాన్ని బార్‌లకు తరలించి ఎక్కువధరకు అమ్ముతున్నట్లు ముందొస్తు సమాచారంతో నిఘా పెట్టి, దాడులు నిర్వహించామని తెలిపారు. ఉన్నతాధికారులు ఎక్సైజ్ ఏసీపి కె. భాస్కరరావు, అస్టిస్టెంట్ సుపరెండెంట్ సుబ్రమణ్యంల ఆదేశాల మేరకు ఈ శివరాత్రి సందర్భంగా ఈ దాడులను నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో బిసీ రోడ్డులోని కళ్యాణి బార్ అండ్ రెస్టారెంట్‌లో 37, కూర్మన్నపాలెంలోని వీరాంజనేయ బార్ అండ్ రెస్టారెంట్‌లో 51, కూర్మన్నపాలెంలోని రామకృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ లోని 17 మొత్తం 105బాటిల్స్‌ను ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అయితే దాడులలో పట్టుబడ్డ బాటిల్స్ పరీక్షలకోసం






పంపించడం జరిగిందని తెలిపారు. ఈ దాడులపై ఉన్నతాధికారులకు నివేదికను పంపించడం జరిగిందని, వచ్చిన ఆదేశాలమేరకు షాపులను ఈ రోజు సీజ్ చేసామని, నిర్వాహకులపై కేసునమోదు చేసినట్లు ఎక్సైజ్ సి.ఐ. జయరామిరెడ్డి తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సంలో మానికిరెడ్డికి పురస్కారం



రాజమహేంద్రవరం: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని కాకినాడ నగరానికి చెందిన సామాజిక వేత్త డా. మానికి రెడ్డి సత్యనారాయణకు ఎమినెంట్ సోషల్ పురస్కారం అందించినట్లు రాజమహేద్రవరంకు చెందిన స్వచ్ఛంద సేవా-ఫిలాత్రోఫిక్ అదినేత డా. అద్దంకి రాజు తెలిపారు.ఆనం రోటరీ హాలు నందు జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమి ఛైర్ ఫర్సన్ నందమూరి లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు.రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి న తర్వాత వినూత్నమైన మార్పులు తీసుకు వస్తున్నారన్నారు.ప్రతిపక్షం చేపుతున్నమాటలు నమ్మవ్దని ఈసందర్భంగా ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీత డా. మానికిరెడ్డి సేవలను లక్ష్మీపార్వతి కొనియాడారు. ఈ కార్యక్రమానికి రాజమహేం ద్రవరం ఎంపీ భరత్ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ షర్మిలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇండియాలో మొట్టమొదటి రియల్‌మీ 5జీ స్మార్ట్‌ఫోన్ ప్రారంభం

విశాఖపట్నం: ప్రపంచంలో వేగంగా అభివ ృద్ధి చెందుతున్న స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ తన మొదటి 5 జీ ఫ్లాగ్‌షిప్ ఫోన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఇది క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 865 5 జీ మొబైల్ ప్లాట్‌ఫామ్‌తో నడిచే ఫ్లాగ్‌షిప్ మోడళ్లలో మొదటి బ్యాచ్లో వచ్చింది. ఇది ఎన్ఎస్ఎ / ఎస్ఐ 5 జీ నెట్‌వర్క్‌కు మద్దతు ఇస్తోంది. ఇది 64 క్వాడ్ కెమెరా, 90 రిఫ్రెష్ రేట్ సూపర్ డార్ట్ ఫ్లాష్ ఛార్జింగ్ తో వస్తుంది. ఈ ధరల వద్ద అద్భుతమైన పనితీరుతో అత్యంత పోటీతత్వ ప్రధాన ఉత్పత్తిగా నిలిచింది. రియల్మే ఎక్స్ 50 ప్రో 5 జీ రెండు రంగులు, మూడు వేరియంట్లలో లభిస్తుంది. వీటి ధర రూ. 37, 999, రూ.39,999, రూ.44,999 ఫ్లిప్‌కార్ట్‌లో లభిస్తుంది.

### ఈ నెల 27న జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం: స్థానిక ఆదర్శ హిందీ ప్రేమిమండలి ఆధ్వర్యంలో ఈ నెల 27న జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా తెలుగు మరియు హిందీ భాషలలో జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని ఆదర్శ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కాళ్ల సూర్యా రామక ృష్ణారావు, గౌరవ అద్యక్షుడు గంటా.నూకరాజు లు తెలిపారు. వ్యాసరచన పోటీలో భారత రత్న సివి రామన్ జీవితంలోని. ముఖ్య అంశములు మరియు వారి పరిశోధనలపై 27 గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రేమిమండలి ఆవరణ లో పరీక్ష నిర్వహిస్తారు.

### తాతాజీ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం

**-ఏపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల హామీ**

**-వెల్ఫేర్ ఫండ్ నుండి పెన్షన్‌కై కృషి చేస్తాం**

కాకినాడ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన టివి5 జిల్లా రిపోర్టర్ తాతాజీ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు తెలిపారు. స్థానిక ఆర్&బి అతిథిగృహంలో మంగళవారం ఉదయం జరిగిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో తాతాజీ భార్య హేమలతకి యూనియన్ తరపున రూ.10వేలు, పెదపూడి ప్రెస్‌క్లబ్ తరపున రూ.10వేలు అందజేశారు.

# ఆదిత్యలో ఘనంగా రాష్ట్ర స్థాయి ప్రోవెస్ - 2కె20

కాకినాడ: ఆదిత్య డిగ్రీ కళాశాల బి.సి.ఎ. (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ ఆప్లికేషన్) విభాగం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రోవెస్-2కె20 4వ రాష్ట్రస్థాయి ఈవెంట్‌ను యన్.ఎఫ్.సి.యల్ రోడ్‌లోగల జీ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ శ్రీమతి డి.బ్యూలా తెలియజేశారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్‌లోగల బి.సి.ఎ మరియు బి.యస్సీ కంప్యూటర్ కోర్సు నిర్వహిస్తున్న 32 కళాశాలల నుండి 650 విద్యార్థులు హజరైయ్యారని తెలిపారు. జ్యోతిప్రజ్వలన, ప్రార్ధనా గీతంతో ప్రారంభమైన ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకాడమిక్ డైరెక్టర్ డా॥ బి.ఇ.వి.యల్. నాయుడు మాట్లడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా తీర్చిదిద్దే విధంగా బి.సి.ఎ. కోర్సులు నిర్వహిస్తున్నామని , కంప్యూటర్స్ విభాగంలో నేటి ఆధునిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులు, కొత్త కోర్సుల పట్ల విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంచటమే కాకుండా వారు యొక్క సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఈపెస్ట్‌ను నిర్వహించామని తెలియజేశారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆదికవి నన్నయ యూనివర్శిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా॥ వి.పెరిసిస్ మాట్లడుతూ డిగ్రీ స్థాయిలో బి.సి.ఎ కోర్సును ఇంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నా ఆదిత్య యజమాన్యాన్ని అభినందించారు. విద్యారులు అర్హత, సామర్థ్యం కలిగి చైతన్యవంతులుగా అవకాశాలను ఒడిసి పట్టుకోవాలని, సరికొత్త విధానాలతో నూతన ఆవిష్కరణలుచేసి కళాశాలకు, దేశానికి పేరు తీసురావాలని




మేనేజింగ్ నైపుణ్యాలు పెంచుకోవాలని, విద్యార్థుల ఆలోచన విధానాన్ని, సమయాన్ని, టెక్నాలజీని, తలిదండ్రులు ఇచ్చే డబ్బును సరియైన విధంగా ఉపయోగించుకున్నపుడే ఫలితం ఉంటుందని తెలియజేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన నైరోస్ టెక్నాలజీ సి.ఇ.ఒ (కాకినాడ) యమ్. పవన్‌కుమార్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న నూతన ఉపాధి అవకాశాలను, పథకాలను సద్వియోగం చేసుకోవాలని అన్నారు. టెక్నాలజీపై పట్టు సాధించి విజేతలుగా ఎదగాలని ఈతరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులదే అని పిలుపునిచ్చారు.

సదస్సు కన్వీనర్ బి.సి.ఎ. కోర్సు ప్రిన్సిపాల్ శ్రీమతి డి. బ్యూలా మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాల బి.సిఎ. కోర్సుకు ఒక ప్రత్యేక గుర్తింపు యున్నదని, బి.సి.ఎ కోర్సు చేస్తున్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, బి.సి.ఎ. విద్యార్థులు తయారుచేసిన సావనీర్‌ను (మ్యాగజైన్) కార్యక్రమానికి హజరైన అతిథుల చేతుమీదుగా ఆవిష్కరించడం జరిగింది.

# 7న మహిళా జర్నలిస్టులకు విశిష్ట ప్రతిభా పురస్కారాలు

**అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు**

**పలువురు అతిథులు చేతులు మీదుగా అవార్డులు ప్రదానం**




విశాఖపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో వివిధ మీడియా సంస్థల్లో విధులు నిర్వహిస్తూ ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తున్న పలువురు మహిళా జర్నలిస్టులను ఘనంగా సత్కరించనున్నట్లు ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు గంట్ల శ్రీనుబాబు, ఎస్.దుర్గారావులు తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వీరు మాట్లాడుతూ 7వ తేదీ ఉదయం 9 గంటల నుంచి స్కూల్ ఆఫ్ దియేటర్ ఆర్ట్స్ సౌజన్యంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 10 గంటలకు మహిళా జర్నలిస్టులకు అతిధులు చేతులు మీదుగా అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమాజాభివృద్ధి కోసం పాటు పడుతున్న మహిళా జర్నలిస్టులను ప్రతీ ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా క్రమం తప్పకుండా సత్కరిస్తూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా మహిళా జర్నలిస్టులకు విశిష్ట ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. వీరితో పాటు మరో ఐదుగురు మహిళా ఉన్నతాధికారులకు విశిష్ట మహిళా పురస్కారాలు అందజేస్తామన్నారు. ఇక ఇద్దరు చిన్నారులకు బాల నృత్య ప్రావిణ్య పురస్కారాలు అందజేస్తామన్నారు. అవార్డుల ఎంపికలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, న్యూస్ రీడర్స్‌కు కూడా ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. వీరితో పాటు ఆకాశవాణి, బిగ్ ఎఫ్ఎం, ఎఫ్ఎం రేడియోలకు చెందిన ఆర్.జె.లను కూడా ఎంపిక చేసి సత్కరించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు అతిథులు హాజరు కానున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో వీజెఎఫ్ ఉపాధ్యక్షులు ఆర్.నాగరాజు పట్నాయక్, మహిళా జర్నలిస్టుల అవార్డుల కమిటీ ఛైర్మన్ పి.వరలక్ష్మి, కార్యవర్గ సభ్యులు ఎమ్.ఎస్.ఆర్.ప్రసాద్, ఇరోతి ఈశ్వరరావు, గయాజ్ తదితరులంతా పాల్గొన్నారు.

## విశాఖ నుంచి కార్గో విమాన సర్వీసులకు రక్షణ శాఖ అభ్యంతరం

### యంపీ ఎంవీవీని కలిసి వినతిపత్రం సమర్పించిన వ్యాపారస్తులు



విశాఖ విమానాశ్రయం నుంచి కార్గో సర్వీసులు నడిపినట్లైతే తమ వ్యాపారాలకు విమాన రవాణా మార్గం అందుబాటులో ఉంటుందని విశాఖ యంపీ ఎంవీవీ సత్యనారాయణను కలిసి కొందరు వ్యాపారస్తులు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై యంపీ కేంద్ర మంత్రులకు తెలియజెప్పడంతో రక్షణ శాఖ మోకాలడ్డింది. దీంతో కార్గో విమాన సర్వీసుల ప్రతిపాదనకు ఆటంకం ఎదురైంది. విశాఖ నుంచి కార్గో విమాన సర్వీసులు ప్రారంభం కావాలని కొంతమంది వ్యాపారులు ఎప్పటినుంచో కోరుతున్న విషయం విదితమే.

దీనిపై ఆంధ్రప్రదేశ్ విమాన ప్రయాణికుల సంఘం వివిధ విమాన సంస్థల ప్రతినిధులతో చర్చించి ఒప్పించింది. అందులో భాగంగా ఈనెల 15 నుంచి స్పైస్ జెట్ ఆధ్వర్యంలో కార్గో విమానాల సర్వీసుల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. అయితే విశాఖలోని రక్షణ శాఖ అధికారుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. దీంతో కార్గో విమాన సర్వీసుకు బ్రేక్ పడింది. దాంతో కార్గో సర్వీసుల నిర్వహణపై స్పైస్ జెట్ సంస్థ రక్షణశాఖ అధికారులకు లేఖ రాసింది. స్పైస్ జెట్ కోరిన సమయాలను కేటాయించలేమని రక్షణ శాఖ అధికారులు స్పైస్ జెట్‌కు లేఖ రాసినట్టు విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యను సంఘ ప్రతినిధులు కొందరు విశాఖ యంపీ ఎంవీవీ సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. విశాఖ నుంచి దేశంలో వివిధ ప్రాంతాలకు కార్గో విమానాలు నడపాలని విశాఖ యంపీగా ఎన్నికైన తర్వాత ఎంవివి సత్యనారాయణ కేంద్ర రక్షణ శాఖ మంత్రికి గతంలో లేఖ రాశారు.

అనంతరం కేంద్రమంత్రులను ఆయన కలిసి విమానాల కోసం చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా కార్యనిర్వహక రాజధాని ఏర్పాట్లు చేయడానికి పలు చర్యలు చేపట్టిందని, అలాగే దేశంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో ఎయిర్ ట్రాఫిక్ 50 శాతం మేర పెరిగే అవకాశం ఉందని తెలిపారు. నిర్దేశించిన సమయాల్లో తప్ప ఇతర సమయాల్లో విమానాలు రాకపోకలకు రక్షణ శాఖ అభ్యంతరం చెబుతుందని, దీనివల్ల అనేక విమాన సంస్థలు సర్వీసులు నడపడానికి ఆసక్తి చూపడం లేదని యంపీ లేఖలో పేర్కొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు

### స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత




విశాఖపట్నం : అంగన్వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. మంగళవారం సర్క్యూట్ హౌస్ లో ఆమె శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల స్త్రీ శిశు సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తల్లి పిల్లలకు మెరుగైన ఆరోగ్యం కల్పించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమృత హస్తం బాలామృతం వంటి ఎన్నో రకాల పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అయినప్పటికీ వ్యవస్థలో ఉన్న లోపాల మూలంగా ప్రజలకు శతశాతం సేవలను అందించలేక పోతున్నాం అన్నారు. లోపం ఎక్కడ ఉన్నది గుర్తించి బాలింతలకు బాలలకు గర్భిణులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేయాలని ప్రతి ఒక్కరూ తమ వృత్తిని దైవంగా భావించాలని విధులను బాధ్యతగా చేయాలని ఆదేశించారు శాఖలోని అందరి కృషి ఫలితంగా రాష్ట్రంలో రక్తహీనత మాతాశిశు మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు. బాగా పనిచేసిన వారికి ప్రోత్సాహాలు అందించాలని అలసత్వం వహించిన వారికి హెచ్చరికలు చేసి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు తల్లిని మరపించేలా అంగన్వాడీ సేవలు వుండాలని చెప్పారు. జోనల్ స్థాయి సమీక్షలు నిర్వహించి బాధితులను ఆదుకుంటూ మహిళాశక్తిని పెంపొందించిచాలన్నారు. వాలంటీర్ల వ్యవస్థను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ మరిన్ని సేవలు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మన శాఖ ద్వారానే అందజేయవలసి ఉంటుందన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం పట్ల ప్రజలందరికీ అవగాహన కలిగించాలన్నారు.

శాఖలో ఆయా నుండి పిడీ వరకు ఎవరు తప్పు చేసినా అవినీతికి పాల్పడిన కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన దిశ చట్టం పట్ల యువతీ యువకులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మహిళల హక్కులను గూర్చి తెలియజేయాలన్నారు. పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబూరావు మాట్లాడుతూ శాఖలలో పవిత్రమైన శాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అని అభివర్ణించారు. పాఠశాలకు ముందు బాలలను తీర్చిదిద్దే అంగన్వాడీల సేవ ఎనలేనిదన్నారు రాష్ట్రంలో ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న శాఖ మహిళా వివక్షతను రూపుమాపేందుకు కూడా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంచాలకులు కృతికా శుక్లా మాట్లాడుతూ శాఖాపరమైన సేవలను అమలు చేయడంలో సి డి పి.వో.లు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి సరి చేస్తూ ఉండాలన్నారు. ఆర్.జె.డి.లు, పి.డి.లు పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. శాఖలో గల ఖాళీలు, పదోన్నతులు, నియామకాలు, భవన నిర్మాణాలు, మౌలిక వసతులు కల్పన క్షుణ్ణంగా సమీక్షించారు. సమావేశంలో ఆర్.జే.డీ. పద్మ పి.డి విశాఖపట్నం సీతామాలక్ష్మి, జాయింట్ డైరెక్టర్స్ శ్రీలత, శివపార్వతి, శైలజ, అసిస్టెంట్ డైరెక్టర్స్ ఉమాదేవి, వసంతబాల, శ్రీకాకుళం పి.డి.కె. జయదేవి, విజయనగరం పి.డి. రాజేశ్వరి. ఏ. పి.డి.లు పాల్గొన్నారు.

## భూసేకరణ సమయంలో మానవతా దృక్పథం పాటించాలి



- ఎవరికీ అన్యాయం జరగకూడదు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్
- ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి

తాడేపల్లి: భూసేకరణ సమయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. స్పందన కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా జిల్లాల వారీగా ఇళ్ల స్థలాల ప్రగతిని సీఎం జగన్ సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే రూపంలో మనం మంచి కార్యక్రమం చేస్తున్నాం. ఎవరి ఉసురూ తగలకూడదు. నా మాటగా చెబుతున్నా. భూ సేకరణ సమయంలో కలెక్టర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. వారిని సంతోష పెట్టి భూమిని తీసుకోవాలి.

అవసరమైతే ఒక రూపాయి ఎక్కువ ఇచ్చి తీసుకోవాలి. ఫలానా కలెక్టర్ అన్యాయంగా తీసుకున్నాడు.. అనే మాట నాకు ఎక్కడా వినిపించకూడదు అంటూ 13 జిల్లాల ఉన్నతాధికారులతో సీఎం జగన్ పేర్కొన్నారు.

## 'చంద్రబాబువి స్వార్థపూరిత రాజకీయాలు'



శ్రీకాకుళం : అమరావతిలో చంద్రబాబు ఆస్తుల విలువ పెంచుకోవడానికే చంద్రబాబు రాజధాని ప్రాంత ప్రజలను రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు మండిపడ్డారు. చంద్రబాబువి స్వార్థపూరిత రాజకీయాలని, కేవలం తన ప్రయోజనాల కోసమే ఇటువంటి దిక్కుమాలిన పోరాటం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ విడిపోయినప్పుడు ఎలా నష్టపోయామో.. గత ఐదేళ్ల చంద్రబాబు పాలనలో అంతకన్నా ఎక్కువ నష్టపోయామని తెలిపారు. అమరావతి పేరుతో వేల కోట్లు దోచుకున్న బాబు రాష్ట్రంలో ప్రాజెక్టులను పట్టించుకోలేదని వెల్లడించారు. ఆయన దోచుకున్న వాటిలో రూ.2వేల కోట్లు ఖర్చు పెట్టుంటే ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవని ఎద్దేవా చేశారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు వారి పార్టీని తిరస్కరించినా బాబుకు బుద్ధి రాలేదని పేర్కొన్నారు. ఇంకా ఎంతకాలం తన దొంగ దీక్షలతో ప్రజలను మోసం చేస్తారని ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు.

## అవినీతి రూపుమాపేందుకు దృష్టిపెట్టాలి

అమరావతి: అన్ని స్థాయిల్లో అవినీతిని రూపుమాపడానికి అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అవినీతి నిరోధానికి ఏర్పాటు చేసిన 14400 టోల్‌ఫ్రీ నంబర్‌పై ప్రచార వీడియోలను ఆయన మంగళవారం విడుదల చేశారు.

సీఎం జగన్, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు సందేశంతో ఈ వీడియోలను తయారు చేశారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ఎట్టిపరిస్థితుల్లోను అవినీతి ఉండకూడదని స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో అవినీతిని ఏరివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

**వారిద్దరికీ అభినందనలు**

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకోనున్న బండి నారాయణస్వామి, పి. సత్యవతి (అనువాద విభాగం)లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. తెలుగు సాహిత్యానికి ఇరువురు విశేషమైన సేవలను అందించారని ప్రశంసించారు.

రాష్ట్రం నుంచి ఇద్దరు రచయితలను ఈ అవార్డులు వరించడం తెలుగువారందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

# గీతంలో ఎన్‌ఎస్‌ఎస్ యువజనోత్సవాలు ముగింపు



సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిదాయలయం వేధికగా జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గీతం అద్యక్షుడు ఎమ్.శ్రీభరత్ హజరై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యతను అర్ధం చేసుకోవాలన్నారు.ఏ రంగంలో ఉన్నా సమాజం పట్ల బాద్యతను మరవకూడదన్నారు. గీతం విద్యార్థులు పాఠశాలలను దత్తతకు స్వీకరించి నిరంతర కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో స్ఫూర్తి నింపుతున్నారని కొనియాడారు. ఎన్‌ఎస్‌ఎస్ యువజనోత్సవాలు సందర్భంగా వ్యాసరచన, క్విజ్, మిమిక్రి, రంగోలీ, పోస్టర్ పెయింటింగ్, డిబేట్, సోలో సాంగ్స్, సోలో ఇన్‌స్ట్రిమెంట్, క్లాసికల్ డ్యాన్స్ తదితర పోటీలను రెండు రోజులగా నిర్వహించారు.ఈ ఎన్‌ఎస్‌ఎస్ యువజనోత్సవ పోటీల విజేతలకు బహుమతలను ఎమ్.శ్రీభరత్ ,ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర స్థాయి అధికారి డాక్టర్ కె.రమేష్ రెడ్డి అందజేశారు. ఓవరల్ ఛాంపియన్ షిప్ జేఎన్‌టియు కాకినాడ విశ్వవిద్యాలయం కైవశం చేసుకుంది. కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డి నేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ తదితరులు విజేతలను అభినందించారు.

**వ్యాసరచన:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మొదటి బహుమతి, రెండువ బహుమతి జేఎన్‌టియూ కాకినేడా విశ్వవిద్యాలయంకు, ముడువ బహుమతి అచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సాధించాయి.

**క్విజ్:**గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మొదటి బహుమతి, రెండువ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, ముడువ బహుమతి సింహపూరి విక్రమా విశ్వవిద్యాలయం రంగోలి: జేఎన్‌టియూ కాకినేడా విశ్వవిద్యాలయంకు మొదటి బహుమతి, రెండువ బహుమతి ఐఐఐటి రఘు, ముడువ బహుమతి ఎన్‌టిఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం

**పోస్టర్ ప్రజెంటేషన్:** జేఎన్‌టియూ కాకినేడా విశ్వవిద్యాలయంకు మొదటి బహుమతి, రెండు వ బహుమతి అచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ముడువ బహుమతి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సాధించాయి.డిబేట్: అచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మొదటి బహుమతి, రెండువ ఎన్‌టిఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం,ముడువ బహుమతి జేఎన్‌టియూ కాకినేడా విశ్వవిద్యాలయంకు,**ఉచ్చరణ:** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మొదటి మహుమతి, జేఎనఎటియు అనంతపురం విశ్వవిద్యాలయం రెండువ బహుమతి ముడువ అచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,దేశభక్తి **పద్యం:**జేఎన్‌టియూ కాకినేడా విశ్వవిద్యాలయంకు, రెండువ బహుమతి అంబేద్కరఎ విశ్వవిద్యాలయం, మొదటి బహుమతి, ముడువ బహుమతి ఐఐఐటి రఘు సోలో **సాంగ్స్:** రాయలశీమ విశ్వవిద్యాలయం మొదటి బహుమతి,రెండువ బహుమతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, ముడువ బహుమతి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సాధించాయి.సోలో ఇన్‌స్ట్రిమెంట్:అచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మొదటి బహుమతి, రెండు వ బహుమతి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, జేఎనఎటియు అనంతపురం విశ్వవిద్యాలయం ముడువ బహుమతి క్లాసికల్ **డ్యాన్స్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం మొదటి బహుమతి,జేఎనఎటియు అనంతపురం విశ్వవిద్యాలయం రెండువ బహుమతి ముడువ బహుమతి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గ్రూప్ **డిష్కసన్స్:** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మొదటి బహుమతి, ండు వ బహుమతి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం,ముడువ బహుమతి ఐఐఐటి రఘు మోనో యాక్షన: మొదటి బహుమతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, రెండు వ బహుమతి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం,ముడువ బహుమతి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సాధించారు. **మిమిక్రి:** ఆంధ్ర విశ్వవిద్యాలయం మొదటి మహుమతి, రెండువ బహుమతి ఐఐఐటి రఘు, రాయలశీమ విశ్వవిద్యాలయం ముడువ పోస్టర్ **పెయింటింగ్** : జేఎనఎటియు అనంతపురం విశ్వవిద్యాలయం మొదటి బహుమతి, రెండువ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంసింహపురి విక్రమ విశ్వవిద్యాలయం సాంధించాయి.




## టీమిండియా కొత్త రికార్డు



క్రైస్ట్‌చర్చి : ఫిబ్రవరి 29 నుంచి క్రైస్ట్‌చర్చి వేదికగా జరగనున్న రెండో టెస్టులో విజయం సాధించాలని టీమిండియా, న్యూజిలాండ్ జట్లు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే టీమిండియాపై 3-0 తేడాతో వన్డే సిరీస్, 10 వికెట్ల తేడాతో తొలి టెస్టును కైవసం చేసుకొన్న కివీస్ రెండో టెస్టులోనూ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. మరోవైపు టెస్టు చాంపియన్‌షిప్‌లో తొలి ఓటమి తర్వాత కనీసం రెండో మ్యాచ్‌లోనైనా గెలిచి సిరీస్‌ను సమం చేయాలని చూస్తుంది. అయితే రెండో టెస్టు జరగనున్న క్రైస్ట్‌చర్చి నగరంలోనే రెండు మైదానాలు ఉన్నాయి. అందులో ఒకటి ఏఎంఐ స్టేడియం కాగా మరొకటి హెగ్లే ఓవల్ స్టేడియం ఉన్నాయి. టీమిండియా ఇప్పటివరకు ఏఎంఐ స్టేడియంలో నాలుగు టెస్టులు ఆడగా రెండు ఓటమిపాలై రెండు డ్రాగా ముగించింది. కాగా హెగ్లే ఓవల్ మైదానంలో మాత్రం ఇంతవరకు టీమిండియా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. శనివారం నుంచి మొదలుకానున్న రెండో టెస్టు మ్యాచ్ భారత్‌కు తొలి మ్యాచ్ కానుంది. ఈ మ్యాచ్‌లో గనుక విజయం సాధిస్తే క్రైస్ట్‌చర్చిలో తొలి విజయంతో పాటు టీమిండియా పేరిట కొత్త రికార్డు నమోదవుతుంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు ఇక్కడ ఆడిన ఆరు టెస్టుల్లో నాలుగు గెలుచుకొని, ఒక మ్యాచ్‌లో ఓటమి చెంది మరో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.


Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com